


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 189 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 15 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :189 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 15 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు



## కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి


- మిగతా2లో

## రెండు ఎల్పీజీ నౌకలు హోర్ముజ్‌ను దాటాయి...

# వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు

**పెన్ పవర్ డెస్క్:**భారతదేశ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనితో హోర్ముజ్‌కు ఇరువైపుల వందలాది నౌకలు నిలిచిపోయాయి. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో, భారత జెండాలు కలిగిన నౌకలు వెళ్లడానికి ఇరాన్ అంగీకరించింది. ఈ క్రమంలో రెండు నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. శివాలిక్, నందాదేవి పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ

- మిగతా7లో





## 2011 నాటి ఫొటోతో గ్యాస్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ పార్టీ అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా విమర్శించారు. పాత ఫోటోలను అడ్డుపెట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తోందని

- మిగతా2లో



## యూఏఈలో అతిపెద్ద టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

**పెన్ పవర్ డెస్క్:**యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏ ఈ)లో అతిపెద్ద ఇంధన నిల్వల కేంద్రమైన పుజైరా ఓడరేవుపై ఇరాన్ డ్రోన్‌లతో దాడి చేసింది. దీంతో ఇక్కడ తీవ్ర

- మిగతా2లో

# మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం

## ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా: పవన్ కల్యాణ్

- ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేస్తాం... అభివృద్ధి చేసి చూపిస్తాం
- గత ప్రభుత్వం నిధుల మళ్లింపే ఏజెన్సీ వెనుకబాటుకు కారణం
- గిరిశిఖర గ్రామాల్లో 18 నెలల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు
- జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచి నీరు అందిస్తాం
- నందిగరువు 'మాట - మంతి' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**పెన్ పవర్ డెస్క్:**తమది 'పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు





# మంత్రి లోకేశ్ ఇంట సంబరాలు

## ఘనంగా దేవాన్ష్ పంచెకట్టు వేడుక...



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆయన కుమారుడు నారా దేవాన్ష్ పంచెకట్టు (ధోతీ) వేడుకను శనివారం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంతోషకరమైన విషయాన్ని లోకేశ్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. తన కుమారుడు భారతీయ సంప్రదాయాలను స్వీకరించడం చూసి గర్వపడుతున్నానని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను కూడా లోకేశ్ పంచుకున్నారు. "ఈ రోజు మా కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు అందరం కలిసి దేవాన్ష్ ధోతీ వేడుకను జరుపుకున్నాం. దేవాన్ష్ పెరిగి పెద్దవాడవుతూ మన సంప్రదాయాలను ఇంత మధురమైన రీతిలో స్వీకరించడం చూడటం మా అందరికీ గర్వకారణం. ఈ ప్రత్యేకమైన ఘట్టం నేపథ్యంలో, దేవాన్ష్‌కు జీవితాంతం సంతోషం, విజయం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వేడుకలో దేవాన్ష్ పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా కనిపించాడు. లోకేశ్ పంచుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పలువురు ప్రముఖులు, అభిమానులు దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక, ఈ విశిష్ట వేడుకకు సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు

- మిగతా2లో

# అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా రాజధాని గ్రామాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు.

అమరావతి పరిధిలోని అనంతవరం, నెక్కల్లు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులతో కలిసి ఈరోజు నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టమైన హామీ ఇచ్చారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గ్రామ కంఠాల బయట ఏ తరహా అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయో, గ్రామాల్లో కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ వ్యవస్థ, ఎల్ఈడీ వీధి దీపాలు, నాణ్యమైన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడతామని... పనులు ప్రారంభించిన


- మిగతా2లో

# గ్యాస్ సరఫరా, వినియోగంపై పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, వినియోగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని, దీనివల్ల బ్లాక్ మార్కెటింగ్‌ను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ

- మిగతా2లో





## తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. దీనితో తెలంగాణలో వినియోగం ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో

- మిగతా2లో

# త్వరలో భారత్‌కు వస్తా

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్..



**పెన్ పవర్ డెస్క్:**భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. భారత్, భారత ప్రజల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, త్వరలోనే దేశంలో పర్యటించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ఇవాళ జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ 2026 సదస్సులో

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కల్పించలేమా !

వ్యాపార వాణిజ్యాలకు కేంద్ర బిందువు ఏకైక వినియోగదారుడు మాత్రమే. వినియోగదారులకు స్పష్టమైన హక్కులు, బాధ్యతలు ఉంటాయి. అనైతిక అన్యాయమైనా వస్తు సేవలు, అక్రమ వ్యాపార పద్ధతులతో వినియోగదారుడు నష్టపోవడంతో అనాదిగా కొనసాగుతున్నది. వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, సమస్యల పట్ల తొలిసారి 15 మార్చి 1962న అమెరికాలో నాటి అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడికి కొన్ని స్పష్టమైన హక్కులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఉపన్యాసాన్ని ప్రేరణగా తీసుకొని ప్రపంచ మానవాళి ప్రతి ఏట 15 మార్చిన "ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం (వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే)"ను పాటించుట 1983 నుంచి ఆనవాయితీగా మారింది. వినియోగదారుల హక్కుల ప్రాధాన్యం, నిజాయితీగా వ్యాపార పద్ధతులు పాటించడం, వినియోగదారుల చట్టాల పరిజ్ఞానం, వస్తు నాణ్యత – సేవలు, వ్యాపార ఆచరణలు, సుస్థిర జీవనశైలి దిశగా వినియోగదారులు మారడం, వినియోగదారుల రక్షణ చర్యలు లాంటి అంశాలను ప్రచారం చేయడానికి ఈ వేదికలను వినియోగించుకోవడం గత నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నది. 2025 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం – 2026 ఇతివృత్తంగా "సురక్షిత ఉత్పత్తులు, నమ్మకంతో కూడిన వినియోగదారులు" అనే అంశాన్ని తీసుకొని ఆరోగ్యకర జీవనశైలి వైపు వినియోగదారుల దృష్టి కోణం మారడం, అందరికీ అందుబాటులోకి తేవడం లాంటివి జరగాలి. భారత వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాల ద్వారా భద్రత హక్కు, సమాచార హక్కు, ఎంపిక హక్కు, అభిప్రాయాలను వినిపించే హక్కు, పరిష్కార హక్కు, వినియోగదారుల విద్య హక్కు లాంటివి కల్పించబడినవి. కల్తీలు, చీకటి వ్యాపారాలు వినియోగదారులకు శాపాలుగా మారుతున్నాయి. భారత్‌లో 24 డిసెంబర్‌న "జాతీయ వినియోగదారుల దినం" జరుపుకోవడం జరుగుతోంది. వినియోగదారులకు అన్యాయాలకు, వస్తు సేవల లోపాలకు గురైనపుడు కోర్టులను లేదా ఫోరమ్‌లను ఆశ్రయించి న్యాయం పొందడమే కాకుండా అక్రమ వ్యాపారులకు శిక్షలు పడడానికి కూడా వెసులుబాటు కల్పించారు. వస్తు విలువలను బట్టి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల కోర్టుల్లో పరిష్కారాలు అందుతున్నాయి. వినియోగదారులు హక్కులను అనుభవిస్తూనే తమ బాధ్యతలను కూడా మరువకుండా చట్టాలను గౌరవిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలి. వినియోగదారుల విద్య పట్ల అవగాహన పెంచుకొని నైతిక విలువలతో ప్రవర్తిస్తూ వ్యాపారుల అనైతిక చర్యలకు స్పందిస్తూ ముందుకు సాగాలి. వ్యాపార సంస్థలు, వినియోగదారుల మధ్య సద్భావనలు, నమ్మకాలు, నీతి నిజాయితీలు, జవాబుదారీతనం లాంటి అంశాల్లో సరైన సంబంధాలు కలిగి ఉండాలి.

# రెండు ఎల్పీజీ నౌకలు హోర్ముజ్‌ను దాటాయి...
# వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు

- మొదటి పేజి తరువాయి

శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

**వంట గ్యాస్ విషయంలో ఇబ్బంది లేదు**

గృహ వినియోగదారులకు వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని కేంద్రం హామీ ఇచ్చింది. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. అవసరం లేకున్నా చాలామంది ఆందోళనతో బుకింగ్ చేస్తున్నారని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలని కోరినట్లు కేంద్రం తెలిపింది. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

వాణిజ్య సిలిండర్ల కొరతపై కూడా కేంద్రం స్పందించింది. ప్రాధాన్యత క్రమంలో వాణిజ్య సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. ఎల్పీజీని అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. బుకింగ్ కోసం గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉందని గుర్తు చేసింది.

**గల్ఫ్‌లో ఉండిపోయిన**

భారతీయ నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. అందులోని సిబ్బంది కూడా సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. హార్ముజ్ జలసంధి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపింది. నావికుల కుటుంబ సభ్యులకు సమాచారం ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని తెలిపింది.

# త్వరలో భారత్‌కు వస్తా

- మొదటి పేజి తరువాయి

ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త, ట్రంప్ విధేయురాలు లారా లూమర్ చదివి వినిపించారు. ఈ సదస్సులో పాల్గొన్న లారా లూమర్, తాను వేదికపైకి రావడానికి సుమారు గంట ముందు అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని సభికులకు తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ చెప్పిన మాటలను ఆమె యథాతథంగా వివరించారు. "నాకు ఇండియా అంటే చాలా ఇష్టం. నేను మోదీని ఎంతగానో ఇష్టపడతానని దయచేసి వారికి తెలియజేయండి. ప్రధాని మోదీ ఒక అద్భుతమైన నాయకుడు, నా మంచి స్నేహితుడు. త్వరలోనే మరో పర్యటన కోసం నేను కచ్చితంగా భారత్‌కు వస్తానని భారత ప్రజలకు చెప్పండి" అని ట్రంప్ తనతో అన్నట్లు లూమర్ పేర్కొన్నారు.అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ రాజకీయాలపై చర్చ జరుగుతున్న ఈ సదస్సులో లూమర్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ట్రంప్, మోదీ మధ్య ఉన్న బలమైన స్నేహబంధాన్ని ఈ సందేశం మరోసారి స్పష్టం చేసింది.

గతంలో అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఉన్న స్నేహం ప్రపంచవ్యాప్తంగా పలుమార్లు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా 2020లో ట్రంప్ భారత పర్యటన సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో లక్షలాది మంది ప్రజల మధ్య నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమం వారిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత బంధానికి నిదర్శనంగా నిలిచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకుంటూ ఇరువురు నేతలు పలు సందర్భాల్లో ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు.

# మంత్రి లోకేశ్ ఇంట సంబరాలు

- మొదటి పేజి తరువాయి

హాజరై మనవడికి దీవెనలు అందించారు. అటు, దేవాన్ష్ తాతయ్య నందమూరి బాలకృష్ణ, అమ్మమ్మ వసుంధర కూడా హాజరై మనవడి పంచెకట్టు వేడుకను సంతోషంగా తిలకించారు.ఇక బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. తెలుగు సంప్రదాయం ప్రకారం మోక్షజ్ఞ మేనమామ హోదాలో దేవాన్ష్ కు కొత్త దుస్తులు బహూకరించాడు.

# తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

- మొదటి పేజి తరువాయి

రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

# యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు.మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు.

కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

# యూఏఈలో అతిపెద్ద టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

- మొదటి పేజి తరువాయి

మంట లు చెలరేగాయి. ఈ ఫుజైరా చమురు కేంద్రం ప్రపంచంలోనే పెద్దది కావడం గమనార్హం. ఇది హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉంటుంది. హోర్ముజ్ జలసంధి మూసివేసినప్పటికీ ఈ ఫుజైరా ఇంధన నిల్వ కేంద్రం పోర్ట్ నుంచి చమురు ఎగుమతులు జరుగుంటాయి.ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి అనంతరం, కొన్ని గంటల్లోనే ఇరాన్ డ్రోన్ బాంబులతో విరుచుకుపడింది. ఈ దాడితో ఫుజైరాలో మంటలు, నల్లటి పొగ అలుముకుంది. అయితే ఇరాన్ డ్రోన్ తో దాడి జరపగా, ఆ డ్రోన్ ను పేల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్ శకలాలు పడిన ప్రాంతం నుంచి పొగలు వస్తున్నాయని స్థానిక అధికారులు చెబుతున్నారు.ఫుజైరా కీలక ఇంధన నిల్వ కేంద్రం కావడంతో ఇరాన్ దీనిని లక్ష్యంగా చేసుకుంది. ఫుజైరా ఆయిల్ డిపో, పోర్టుపై బాంబులు, మిసైళ్లతో దాడికి పాల్పడింది. దాడికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన యూఏఈ ఫుజైరా చమురు పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. చమురు ఎగుమతులు, దిగుమతులను నిలిపివేసింది. గల్ఫ్ దేశాల చమురు ఎగుమతులు, దిగుమతులకు ఇది ప్రధాన కేంద్రం. ఫుజైరా చమురు పోర్టును మూసివేస్తే భారత్, చైనా, పాకిస్థాన్ సహా వివిధ దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడే అవకాశం ఉంది.

# గ్యాస్ సరఫరా, వినియోగంపై పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ప్రాంతాల్లో 45 రోజుల గడువు విధించినట్టు తెలిపారు. డబుల్ సిలిండర్ ఉన్న వారికి 32 రోజుల చొప్పున రీఫిల్ బుకింగ్‌పై పరిమితి విధించినట్లు మంత్రి వివరించారు.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ... ఆసుపత్రులు, హాస్టళ్ళు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రిఫైనరీలను ఆదేశించిందని, ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకు ఉత్పత్తి మన దేశంలోనే జరుగుతోందని వెల్లడించారు. హోటల్ అసోసియేషన్లతో కూడా చర్చలు జరుపుతున్నామని, వారు బొగ్గుతో నడిచే తందూరి బట్టీల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. సోలార్ కుకింగ్ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రధాన ఆలయాల్లో ఇప్పటికే స్టీమ్ కుకింగ్ అమలులో ఉందని ఆయన గుర్తుచేశారు.రాష్ట్రంలో గ్యాస్ ధరలు పెరగకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆర్‌టీజీఎస్ ద్వారా అన్ని బృందాలతో సమావేశమై గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షించనున్నారని వెల్లడించారు. అధిక ధరలు వసూలు చేసే హోటళ్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# 2011 నాటి ఫొటోతో గ్యాస్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

శనివారం ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు. 2011లో ఎల్పీజీ సిలిండర్ల కోసం ప్రజలు క్యూలో నిల్చున్న ఫోటోను కాంగ్రెస్ ఇప్పుడు వాడుకుంటోందని ఆయన ఆధారాలతో సహా బయటపెట్టారు. "ఇలాంటి చర్యలతో కాంగ్రెస్ పార్టీ తనను తాను అవమానించుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ బలమైన నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉందని, ఇంధన సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని రిజిజు భరోసా ఇచ్చారు.

మరోవైపు, బీజేపీ జాతీయ ఐటీ సెల్ ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ కూడా ఈ విషయంపై స్పందించారు. ఇరాన్ సంక్షోభం తర్వాత జీ20 దేశాల్లో పెట్రోల్ ధరల పెరుగుదలను వివరిస్తూ ఓ జాబితాను విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం, అమెరికాలో 22 శాతం ధర పెరగగా, భారత్‌లో మాత్రం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. భారత్‌తో పాటు సౌదీ అరేబియా, ఇండోనేషియాలో కూడా ధరలు పెరగలేదని ఆయన పేర్కొన్నారు.దేశంలో ముడి చమురు, పెట్రోల్, డీజిల్, ఎల్పీజీలకు సరిపడా నిల్వలు ఉన్నాయని విదేశాంగ శాఖ కూడా స్పష్టం చేసింది. ఇరాన్ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని భారత్ పిలుపునిచ్చిందని, సముద్ర వాణిజ్య కార్యకలాపాలకు భద్రత కల్పించి, ప్రభావిత ప్రాంతంలోని భారతీయ నావికులను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# తన ఇంటికి సీఎం చంద్రబాబు రావడం పట్ల అల్లు శిరీష్ ఆనందం...



టాలీవుడ్ యువ కథానాయకుడు, నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు అల్లు శిరీష్ ఇటీవల నయనికా రెడ్డిని వివాహం చేసుకుని ఓ ఇంటివాడైన సంగతి తెలిసిందే. ఈ నూతన దంపతులను ఆశీర్వదించడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వారి ఇంటికి వెళ్లారు. వధూవరులు శిరీష్, నయనికలను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ అనూహ్య పరిణామంపై అల్లు శిరీష్ సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. చంద్రబాబుతో భేటీ తన జీవితంలో అత్యంత గుర్తుండిపోయే అనుభవమని పేర్కొన్నారు. "ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం. దశాబ్దాలుగా నేను ఆరాధించే నాయకుడు, మన ఏపీ సీఎం చంద్రబాబు గారు మా ఇంటికి వచ్చి నన్ను, నయనికను ఆశీర్వదించారు. ఆ దార్శనిక నేతతో గంటసేపు మాట్లాడటం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను" అని శిరీష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ఇటీవల అల్లు శిరీష్, నయనికా రెడ్డిల వివాహం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో అల్లు అరవింద్ తదితరులు సమావేశమై కాసేపు ముచ్చటించారు. చంద్రబాబుతో శిరీష్ దంపతులు ఉన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.రాజధాని నిర్మాణ గడువులపై కూడా నారాయణ కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల నివాస భవనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే, 2027 జూన్ నాటికి 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇక అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ భవనాలు 2028 డిసెంబర్ నాటికి పూర్తవుతాయని వివరించారు. నిన్ననే ఉండవల్లి వద్ద స్టీల్ బ్రిడ్జ్ పనులను పరిశీలించిన మంత్రి, నేడు నేరుగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించడం విశేషం.

# బాలికల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వ ముందడుగు

# అభినందనీయం: టిడిపి నాయకులు





**సి.ఎస్.పురం, పెన్ పవర్ మార్చి 14**

బాలికల ఆరోగ్యరక్షణకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్పివి టీకాలను ఎన్డీఏ కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు జాగ్రత్త చర్యగా ప్రవేశపెట్టడం అభినందనీయమని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మాజీ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య అన్నారు మండల కేంద్రంలోని సి.ఎస్.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం శనివారం హెచ్పీవీ టీకాలు వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళి సమక్షంలో వైద్య సిబ్బంది ఈ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మండల మాజీ టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని ముందుగానే నివారించేందుకు 14 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్పీవీ టీకాలు వేయించడం ఎంతో ప్రాముఖ్యత కలిగిన నిర్ణయమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్య రక్షణకు దోహదపడుతుందని అన్నారు అనంతరం వైద్యాధికారి డాక్టర్ మురళి మాట్లాడుతూ మండల పరిధిలో 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు సుమారు 180 మంది ఉన్నారని తెలిపారు అందులో భాగంగా శనివారం మొదటి దశలో 12 మంది బాలికలకు హెచ్ పి వి టీకాలు వేసామని అన్నారు ప్రతి వారంలో ఒకరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మండలంలోని బాలికలందరికి టీకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, 14 సంవత్సరాల వయసు గల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమానికి సహకరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, టిడిపి జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదు

## టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 14**

వైద్య సేవల కోసం వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించి వారిని ప్రేమగా పలకరించాలని, వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. ప్రభుత్వ ప్రజా వైద్యశాలను శనివారం ఆయన అకస్మిక తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి ఆరోగ్యపరిస్థితులు, అందుతున్న వైద్య సేవలు, గురించి అడిగితెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో వివరంగా విచారించి, అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.ఆసుపత్రిలోనీ ప్రసూతి విభాగం,జనరల్ వార్డ్, డయాలసిస్ విభాగం,క్యాజువాలిటీ, రక్త పరీక్ష ల్యాబ్,ఆపరేషన్ థియేటర్ లను పరిశీలించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎ యం సి చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, నాయకులు వేగినాటి శ్రీనివాస్, తోట మహేష్ నాయుడు,ముస్లీం మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్,మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెమలిగుండ్ల రంగనాయక స్వామి

# బ్రహ్మోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజబాబు

## అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ - ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన పవర మార్చి 14**

రాచర్ల మండలం జె. పుల్లల చెరువు గ్రామంలో సమీపంలో నలమల్ల కీకారణ్యం స్వయంభువుగా వెలసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహోత్సవాలు ఏప్రిల్ 2, 3, 4, 5 తేదీలలో నిర్వహించనున్నారు . ఈ బ్రహోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తారు. మన ప్రాంతమేనుంచే కాక పొరుగు ప్రాంతాల నుండి పొరుగు రాష్టాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్నారు. అందుకు తగినట్లు గా ఏర్పాట్లు , అటవీ ప్రాంతంలో పార్కింగ్, స్వామి దర్శనం ఏర్పాట్లు, ఇతరవసతులు కల్పించాల్సివుంది. ఈనేపధ్యంలో నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పి రాజాబాబు , ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి లు శనివారం ఆలయ ప్రాంగణంలో అన్నిశాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రవాణా, భద్రత వంటి అన్ని సౌకర్యాలను సమగ్రంగా ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ రాజబాబు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆలయ పరిసరాల్లో శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య



సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహోత్సవాల సందర్భంగా ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఆసౌకార్య కలగకుండా చూడాలని, నీటి సౌకర్యం , విద్యుత్ సౌకార్యాలకు ఇబ్బంది లేకుండా చూద్దాలన్నారు. అట్లే స్వామి దర్శనం ఏర్పాట్లను చేయాలన్నారు. ఈ ఒక్క భక్తుడు నిరాశ నిస్రుహాలతో వెళ్లారాదన్నారు. బ్రహోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిచాలన్నారు. స్వామి వారి కళ్యాణం ఏర్పాట్లు ,పకడ్బందీగా ఉండాలన్నారు. ప్రధానంగా నెమలిగుండంలో భక్తులు స్నానాల సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.



ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేకోకుండా పహారా ఉండాలని.మరి లోతుకు వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. రథోత్సవం, తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు. పార్కింగ్ స్థలం, బండలాగుడు పందెం, తదితర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రాజాబాబు కి తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖ టైగర్ ప్రాజక్టు డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి , వివిధ శాఖల అధికారులు, దేవస్థానం ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సే జనసేన లక్ష్యం..



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 14**

పుల్లలచెరువు మండల కేంద్రంలో జనసేన పార్టీ 13 ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు కొఠారి అచ్చయ్య ఆధ్వర్యంలో జనసైనికులు ఘనంగా నిర్వహించారు. జనసైనికులు, వీరమహిళలు కలిసి జై జనసేన జై పవన్ కళ్యాణ్ నినాదాలతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు కొఠారి అచ్చయ్య మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకురావడం, సమాజ శ్రేయస్సు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ఏర్పడిన పార్టీ జనసేన అని తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రతి జనసైనికుడు, వీరమహిళ, నాయకుడికి అభినందనలు తెలిపారు.అలాగే పుల్లలచెరువు మండలంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు ఆకుల చిన్న వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఉప్పల హనుమంతరావు, ఆర్మీ బుజ్జి, ఏఎంసీ డైరెక్టర్ పసుపులేటి వెంకటేశ్వర్లు (బుజ్జి), చెవూరి శ్రీను, శెట్టి పెద్దయ్య, తాటి వీరమ్మ, బొందలపాటి వెంకీ, రమణయ్య, గాదె శివ, కటకం అంజి, లచ్చయ్య, నాగేంద్రబాబు, నాగరాజు, కాసా చిన్నయ్య, కాసా లక్ష్మయ్య, కొండారి వెంకట లక్ష్మయ్య, కొండా ఎలీషా, కాసా గోపి, వాసు, శశి, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్.పీ గ్యాస్ గోడౌన్‌ను తనిఖీచేసిన తహశీల్దార్



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 14:**

మండలంలోని చిమిడితిపాడు గ్రామ సమీపంలో ఉన్న హెచ్.పీ గ్యాస్ గోడౌన్ ను స్థానిక తహశీల్దార్ బాల కిషోర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధ నేపథ్యంలో గ్యాస్ కొరత రావడం, గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయనే పుకార్లు రావడంతో తహశీల్దార్ ఈ తనికీలు చేపట్టారు. గ్యాస్ గోడౌన్ లో ఉన్న సిలిండర్లను పరిశీలించి, సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బాల కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశముల మేరకు చెమిదడిదపాడులో గల వినాయక హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసి స్టాక్, డెలివరీ విధానం సరి చూడడమైనదన్నారు. డెలివరీ సవ్యంగా జరిగేటట్లు చూడమని సూచనలు జారీ చేయడమైనదన్నారు. ప్రజలకు, ముఖ్యంగా గృహ వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా తగు చర్యలకు సూచనలు జారీ చేయడమైనదని తహశీల్దార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తో పాటు రెవిన్యూ సిబ్బంది, వినాయక గ్యాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

## కూలీల ఆటోను ఢీకొన్న కారు -ఇద్దరు కూలీలు మృతి.

## వీరేపల్లి-మోచర్ల మధ్య హైవేపై ఘటన -సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 14**

కూలీలతో వెళుతున్న ఆటోను వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందిన సంఘటన 16వ నెంబర్ జాతీయ రహదారిపై వీరేపల్లి-మోచర్ల మధ్య శనివారం ఉదయం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం ఉలవపాడు మండలం వీరేపల్లి పంచాయతీ రైలు పట్టాల ఎస్.టీ కాలనీకి చెందిన కూలీలు ఆటోలో కర్రకొట్టుడు పనికి బయలుదేరారు. వీరేపల్లి హైవే ఎక్కి కొంచెం దూరం చప్టా వద్దకు వెళ్ళగానే, తమిళనాడుకు చెందిన కారు ముందు వెళుతున్న ఆటోను వేగంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కూలీల ఆటో ఎగిరి హైవే పక్కన ఉన్న చప్టాలో పడినది. దీనితో ఆటోలో ప్రయాణిస్తున్న యాకసిరి రాములు అక్కడికక్కడే మృతి చెందగా, యాకసిరి వెంకయ్య వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇండ్ల పోలయ్య, ఆటోడ్రైవర్ సుల్తాన్ బాషాల పరిస్థితి విషమంగా ఉండగా, మిగిలిన బాపట్ల అంజయ్య, పోట్లూరి వెంకటేశ్వర్లు, చేవూరు మహేష్, యకసిరి నాగేశ్వరరావులు స్వల్ప



గాయాలతో బయట పడ్డారు. గతంలో ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రాంతంపై పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ప్రమాదస్థలిని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు

## జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 14**



పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరిగే పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. ఇన్విజిలేటర్లు మరియు విధుల్లో ఉన్న సిబ్బంది తప్ప ఇతరులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని తెలిపారు. మాస్ కాపీయింగ్ లేదా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచిస్తూ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఆల్ ది బెస్ట్ తెలిపారు.

# ఇంటి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించాలి

**జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి. వెంకటేశ్వరరావు**



**పెన్ పవర్, కంభం మార్చి 14**

కంభం మండలంలోని తురిమెళ్ళ గ్రామపంచాయతీ నందు ఇంటి పన్ను బకాయిలను వెంటనే చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధి కి సహకరించాలని డిపిఓ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. తురిమెళ్ళ గ్రామపంచాయతీ పరిధిలోని పలు గృహాల వద్దకు వెళ్లి ఇంటి పన్నులు వసూలు చేశారు . తదుపరి స్వర్ణ గ్రామం ని తనిఖీ చేసి పన్ను వసూలు వేగవంతం చేయాలనీ పంచాయతీ సుబ్బందికి మరియు వెలుగు వివో ఏ లకు ఆదేశాలు జారీ చేసారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు పన్నుల వసుల్లపై ప్రత్యేక దృష్టి సా రించామన్నారు. పన్నులు చెల్లిస్తే వీధి దీపాలు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు తదితర సేవలు వెంటనే మెరుగవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 15 లోపు 100% పన్ను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశాలు జారిచేసారు. ఈ కార్యక్రమం నందు గ్రామ పంచాయతీ సర్పంచ్ సుభద్ర డి డి ఓ మార్కాపురం బాలు నాయక్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి వీరభద్ర చారి డిప్యూటీ ఎంపీ డివో బి విజయలక్ష్మి , వివో ఏ లీడర్స్, స్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**17వ రోజు ఇంటర్మీడియట్ పరీక్షకు**

# 27 మంది గైర్హాజరు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 14**

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 17 వరోజు శనివారంనాడు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది. పౌర శాస్త్రం -1 (న్యూ),పౌర శాస్త్రం -1 (ఓల్డ్) ఈ రోజు నిర్వహించబడింది. పరీక్ష కేంద్రాల్లో కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీ నిర్వహించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం. మురళీకృష్ణ,ఎ.అల్లూరయ్య,ఆర్. శిరీష కుమారి హాజరు వివరాలను తెలిపారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 103 మంది హాజరవ్వాల్సి ఉండగా 76 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 22 మందికి 17 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. శ్రీ జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 37 మందికి 26 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు.సాహితి జూనియర్ కళాశాలలో 44 మందికి గాను 33 మంది హాజరై,11మంది గైర్హాజరయ్యారు. గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నేడు పుల్లారెడ్డి పల్లె, ఎర్రం శెట్టి వానిపల్లె గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత



**కొమరోలు పెన్ పవర్ మార్చి 14**

కొమరోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చింతలపల్లి ఫీడర్లో గల పుల్లారెడ్డిపల్లి, ఎర్రం శెట్టివాని పల్లె గ్రామాలకు ఈనెల 15వ తేదీ ఆదివారం విద్యుత్తు సరఫరాను నిలిపివేయవలసి వస్తున్నదని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా ఈనెల 15వ తేదీ ఆదివారం చింతలపల్లి ఫీడర్లోని పుల్లారెడ్డి పల్లె ఎంసెట్ వాని పల్లె గ్రామాలలో కొత్త లేని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. ఆ కారణంగా సదరు రెండు గ్రామాలకు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్న ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయ నున్నట్లుగా శ్రీనివాసులు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.


# కంటి దృష్టిని నిశ్శబ్దంగా చంపే వ్యాధి గ్లకోమా

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 14**

రాష్ట్ర అందత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్లకోమా వ్యాధిపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు లోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలురఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా. జి . కె.మోహన్ రెడ్డి మాట్లాడుతూ కంటి శుక్లాల (క్యాటరాక్ట్) తర్వాత అత్యంత ప్రమాదకరమైన అందత్వం కలిగించే వ్యాధి గ్లకోమా దీనినే నీటి శుక్లాలని కూడా అంటారని పేర్కొన్నారు. 2026 సంవత్సరపు గ్లకోమా వ్యాధి ముఖ్య ఉద్దేశ్యము ఏమనగా గ్లకోమా వ్యాధి లేని ప్రపంచం కోసము అందరము ఐక్యమత్యంగా ఉండటము.ఈ గ్లకోమా వ్యాధిగ్రస్తులు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 95 మిలియన్ల మంది ఉన్నారన్నారు. ఈ వ్యాధి వలన శాశ్వతంగా చూపు కోల్పోయిన వారు దాదాపుగా 90 లక్షల మంది ఉన్నారని.అదేవిధంగా మన భారత దేశంలో దాదాపు 12 మిలియన్లు మంది ఉన్నారన్నారు. గ్లకోమా వ్యాధి అనగా కంటిలో నీటి ఒత్తిడి పెరగడం (ఇంట్రాకులర్ ప్రెషర్) వలన కంటిలో నాడులో నలిగి,దెబ్బతిని క్రమముగా అందత్వం కలిగించే వ్యాధిని గ్లకోమావ్యాధి లేదా నీటికాసులు అని అంటారన్నారు. ఈ వ్యాధి 40 సంవత్సరములు పైబడిన వారికి వస్తుందని. అదే వయసులో శుక్లాలు కూడా రావటం వల్ల చాలామంది గ్లకోమే వ్యాధి ఉన్నా శుక్లాల వల్ల కంటిచూపు తగ్గుతుందని అపోహపడి అది ముదిరే వరకు ఆపరేషన్ చేయించుకోరని. దీనివల్ల క్రమంగా అందత్వము వస్తుందన్నారు. సాధారణంగా ప్రజలు దగ్గరచూపు కనపడదని కంటి దృష్టి పరీక్షకు ఆసుపత్రికి వచ్చినప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది. కనుక దృష్టిలోపం కలవారు కంటి వైద్యుని దగ్గరికి వెళ్లి వారు వాడే కళ్ళజోడు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షించుకోవాలన్నారు .ప్రతి సంవత్సరం కంటి పరీక్ష చేయించుకొని



సరియైన కళ్ళజోడు వాడాలని. అంతేగాని పాత కళ్ళజోడు సుదీర్ఘకాలం వాడినచో గ్లోకోమా వ్యాధితో దృష్టి కోల్పోయే అవకాశం ఉన్నదన్నారు. ఈమధ్య కాలంలో డయాబెటిస్, హైపర్ టెన్షన్ అనగా చక్కెర వ్యాధి, బి.పి.వ్యాధులు గలవారు కూడా ఈ వ్యాధికి ఎక్కువగా గురి అవుతున్నారని , ఈ వ్యాధి కలవారు సరైన ఆహార పదార్థాలు వాడుతూ వ్యాయామం చేస్తూ క్రమశిక్షణ జీవితముతో బి.పి.వ్యాధిని, చక్కెర వ్యాధిని అదుపులో ఉంచుకోవాలన్నారు గ్లకోమావ్యాధి లక్షణాలు కరెంటు దీపము చుట్టూ రంగురంగుల కాంతులు వలయంగా కనిపించుట తరచుగా తలనొప్పి కంటిలో నొప్పి, ఎరుపు, వాపు, నీళ్లు కారటము, కంటిలో గుచ్చుకున్నట్లు, కళ్ళు మసకగా కనిపించడము, కంటి దృష్టిలోపాలు, కంటిలో (ఇంట్రా కులర్ ప్రెజర్) అనగా నీటి ఒత్తిడి పెరగటం. ఈ ఒత్తిడి సాధారణంగా 16 నుండి 20 మిల్లీమీటర్స్. ఆఫ్.హెచ్. జి. వరకు ఉండాలి. దీనిని టోనోమీటర్ అనే పరికరం ద్వారా పరీక్షిస్తారు ఈ ఒత్తిడి పెరగడం వల్ల కంటిలో ఆప్టిక్ డిస్క్ పరిమాణం పెరిగి, మార్పు కలిగి, ఆప్టిక్ డిస్క్ పాలిపోయినట్లు తెల్లబడుతుంది దీనివల్ల కంటినర దెబ్బతిని దృష్టిని శాశ్వతంగా కోల్పోతారు. అదేవిధంగా కంటి దృష్టి క్షేత్రంలో మార్పులను పెరిమీటర్ అనే పరికరం ద్వారా పరీక్షిస్తారన్నారు. ముఖ్యంగా క్రమేపి




కంటి దృష్టి తగ్గిపోతూ ఒక గొట్టంలో నుంచి చూస్తున్నట్లుగా ఉంటుంది చివరికి ఇది కూడా కనిపించక పూర్తిగా అందత్వం వస్తుందని.గ్లకోమా వ్యాధికి చికిత్సలు గ్లకోమా వ్యాధికి కారణమైన కంటిలోని నీటి ఒత్తిడిని (ఇంట్రా ఆకులర్ ప్రెజర్) కంటి మందుల ద్వారా నివారించవచ్చును ఈ మందులు జీవితాంతం వాడాలి. ఒకవేళ మందుల ద్వారా తగ్గకపోతే లేజర్ శస్త్ర చికిత్స అవసరం అవుతుంది కనుక గ్లోకోమా వ్యాధిగ్రస్తుడు ప్రతి మూడు,ఆరు నెలలకోసారి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారుఈ కార్యక్రమంనకు అధ్యక్షత వహించిన ప్రధాన ఉపాధ్యాయుడు ఎం సిద్దేశ్వర శర్మ మాట్లాడుతూ ఆకుపచ్చని ఆకుకూరలు కాయగూరలు మంచి పోషకాహారాలు విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని అన్నారు గ్లకోమా వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే అందత్వాన్ని నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్ రెడ్డి, డి.పీరయ్య బ్రహ్మం, పి.పీరయ్య ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 510 కేసుల పరిష్కారం



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 14**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ , ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశముల మేరకు శనివారం గిద్దలూరు కోర్ట్ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు . మొదటి బెంచ్ కు ప్రీసైడింగ్ ఆఫీసర్ గా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్, మెంబర్లుగా జి. ఆనంద్ కుమార్ , ఎన్. అహల్య వ్యవహరించారు. రెండవ బెంచ్ కు ప్రిసైడింగ్ ఆఫీసర్ గా అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె. భరత్ చంద్ర ,మెంబర్లుగా ఎం. పిచ్చయ్య, కె.సత్య సులోచన వ్యవహరించారు . 5 సివిల్ కేసులకు 8 లక్షల 74 వేల 550 రూపాయలు, 2 డిక్రీ అ మలు కేసులుకు 4 లక్షల 30 వేల రూపాయలు, 1 రెంట్ కంట్రోల్ కేసు కు 4 లక్షల 54 వేల రూపాయలు,3 భరణం కేసులకు 6లక్షల రూపాయలు, రెండు గృహహింస కేసులు,1 చెక్కు బౌన్స్ కేసుకు 2 లక్షల 50 వేల రూపాయలు,36 క్రిమినల్ కేసులకు 50వేల రూపాయలు,1 ఎక్సైజ్ కేసుకు 45,000 రూపాయలు, పెట్టి కేసులకు 45 వేల రూపాయలు,1 బ్యాంక్ పి. ఎల్. సి. కేసుకు 1,10,000 రూపాయలు,8 టెలిఫోన్ పి. ఎల్. సి. కేసులకు 5000 రూపాయలు... మొత్తం 510 కేసులకు 28, 18, 550 గా పరిష్కరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఆరు మండలాల పోలీస్ ఆఫీసర్స్,కక్షి దారులు, కోర్ట్ సిబ్బంది,పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుని కలసిన అప్పిశెట్టి ఉదయ్ శంకర్



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 14**

నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అభిరుచి మధు నంద్యాల నుండి ఒంగోలు వెళ్ళు తూ మార్గమధ్యలో గిద్దలూరు బైపాస్ లో ఆగిన సమయంల్ గిద్దలూరు బీజేపీ నాయకులు అపి శెట్టి ఉదయ్ శంకర్, ప్రకాశము జిల్లా మాజీ ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు, రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్య వర్గ సభ్యులు ఖాదర్ వలి షఫీ, వేమూరి శ్రీనివాసులు కలసి పార్టీ అభివృద్ధి, పార్టీ కార్యకర్తలు విషయాలు చర్చించారు .ఈ సందర్బంగా అప్పిశెట్టి ఉదయ్ శంకర్ భవిష్యత్తు లో గిద్దలూరు నియోజకవర్గం జిల్లా లో పార్టీ అభివృద్ధి లో మొదటి స్థానం లో ఉంచడానికి కృషి చేస్తానని తెలియజేశారు.

# సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

**ప్రెస్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు కోటయ్య**

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 14**

చెడు వ్యాసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో నడిచి సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలని ప్రెస్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల కోటయ్య అన్నారు. శనివారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతు, నేడు సమాజంలోని దుష్ట శక్తుల కారణంగా యువకులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, మద్యం, గంజాయి లాంటి వ్యాసనాలకు లోనై బంగారు భవిష్యత్తును



చేతులారా నాశనం చేసుకుంటున్నారని అన్నారు.చదువుకునే విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని, యువతను చెడుదారి పట్టిస్తున్న మత్తు పదార్థాల సమాచారాన్ని పోలీస్ శాఖకు తెలుపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్,ఉపాధ్యక్షులు షేక్ షరీఫ్, గౌరవ సలహాదారులు సయ్యద్ షాబీర్ హుస్సేన్ (సర్దార్ ), సహాయ కార్యదర్శులు, చేకూరి చంద్రబాబు శేఖర్,బొర్రారెడ్డి,కోశాధికారి పొట్టి రవికుమార్ మీడియా ఇంచార్జి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

**లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన టిడిపి నాయకులు**



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 14**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి సమక్షంలో టిడిపి నాయకులతో కలిసి మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మాజీ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య శనివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా కోవిలంపాడు గ్రామానికి చెందిన భూమిరెడ్డి సూర్యనారాయణ మరియు పోలవరపు రవి లకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైద్య చికిత్స కోసం ప్రభుత్వం అందించిన ఈ సహాయం వారి కుటుంబానికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని అన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తూ, ప్రజలకు కష్ట సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం గొప్ప విషయమని అన్నారు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రజల సమస్యలను గుర్తించి అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంచిని తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక భరోసా కల్పించడం టిడిపి తోనే సాధ్యమని కొనియాడారు ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు డి మోహన్ రెడ్డి, నారాయణస్వామి దేవస్థానం మాజీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, మాజీ గ్రామ టిడిపి అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, పోకల మాల్యాద్రి, సంధలూరి బాలకాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్.ఆర్ బ్లూస్మల్ స్కూల్ వార్షికోత్సవం

**గిద్దలూరు. పెన్ పవర్ మార్చి 14**

పట్టణంలోని రంగారెడ్డి (ఆర్.ఆర్. స్కూలు ) 15 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గిద్దలూరు పట్టణ మున్సిపల్ కమిషనర్ రమణ బాబు మాట్లాడుతూ పిల్లలకు ఎంతో క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించడం ఎంతో అవసరమన్నారు , పిల్లలకు వార్షికోత్సవ సందర్భంగా ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ వార్షికోత్సవాన్ని ఏర్పాటు అభినందనీయమని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి మండల విద్యాశాఖ అధికారి అశ్విని కుమార్ మాట్లాడుతూ పట్టణంలో విలువలతో కూడిన విద్యను అందించడంలో ఆర్ఆర్ స్కూల్ ముందు వరుసలో ఉందని కొనియాడారు, మరో ముఖ్య అతిథి పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించడం ఎంతో అవసరమన్నారు . పాఠశాల కరస్పాండెంట్ అనురాధ మాట్లాడుతూ మా పిల్లల భవిష్యత్తుకు చక్కటి పునాది వేయడంలో మా పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది నాతో పాటు ఎంతో కష్ట పడుతున్నారని కొనియాడారు అంతేకాకుండా పిల్లల తల్లిదండ్రులు



కూడా మా మీద నమ్మకంతో మా స్కూల్లో పిల్లలను చేర్పించి మాతో సహకరిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వంశీధర్ రెడ్డి, సూర్య విద్యానికేతన్ కరస్పాండెంట్ బ్రహ్మానంద రెడ్డి, స్కూల్ రెస్పాండెంట్ ఖాజావలి , జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కాలనిలో పోలీసుల తనిఖీ 22వాహనాలు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 14**

పట్టణలోని ఇందిరమ్మ కాలనిలో పోలీసులు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించి 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.జిల్లా యస్పీ వి, హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు స్థానిక సిఐ అజయ్ కుమార్,యస్ఐ యం, దేవకుమార్ లు ఇందిరమ్మ కాలనిలోని గృహాలను తనిఖీలు నిర్వహించారు.కాలనిలో సరైన ధ్రువ పత్రాలు లేని వారిని విచారించి 22వాహనాలను సిజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సి ఐ అజయ్ కుమార్ మాట్లాడుతు వాహనాల తాలూకు ఎటువంటి పత్రాలు లేకుండా, లైసెన్స్ లు లేకుండా వాహనాలు నడుపరాదని, వాహనాలు ఎవరివద్ద కొనుగోలు చేసారో తెలుపాలన్నారు. ఎవరైనా గంజాయి, నాటుసారా సేవించిన, అమ్మకాలు కొనుగోలు చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమం లో సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ రాజబాబుకు నెమలిగుండం వద్ద అపూర్వస్వాగతం

## నెమలిగుండ్ల రంగస్వామిని దర్శించి, ప్రత్యక పూజలు చేసిన కలెక్టర్ రాజబాబు

## శేషవస్త్రం, వేదాశీస్సులు అందజేసిన వేదం పండితులు





**గిద్దలూరు పెన్ పవర్ మర్చి 14**

నలమల్ల కీకారణ్యం వెలసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం , ఈప్రాంత ప్రజల ఇలావేల్పు శ్రీ నెమలిగుండ్ల రంగస్వామి బ్రహోత్సవాలు ఏప్రిల్ 2 నుండి 5 వతేది వరకు 4 రోజులపాటు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో దేవస్థానం ప్రాంగణములో ఏర్పాట్ల ను పరిశీలించి , సమీక్ష నివహించేందుకు నెమలి గుండం చేరుకున్న కలెక్టర్ రాజబాబుకు , ఎమ్మెల్యే ముత్తుముల కు ఆలయకమిటి సభ్యులు, అధికారులు , టిడిపి నాయకులు పుష్ప గుచ్చాలనందజేసి అపూర్వస్వాగతం పలికారు.

అనంతరం కలెక్టర్ రాజబాబు, ఎమ్మెల్యే ముతూముల లు ఆలయానికి చేరుకుని నెమలిగుండ్ల రంగస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో ముఖమండపంలో కలెక్టర్ రాజబాబు , ముత్తుముల అశోక్ రెడ్డి, డి ఎఫ్ ఓ నిషాకుమారి, సబ్ కలెక్టర్ శ్రీనివాసులు కు స్వామివారి శేష వస్త్రం బహుకరించి వేదాశీస్సులు అందజేశారు. ఈ సందర్బంగా ఆలయ ప్రాశస్త్యం ను కలెక్టర్ కు అర్చకులు సత్యనారాయణ వివరించారు. ఆలయ ప్రాశస్త్యం విన్న కలెక్టర్ ఆశ్చర్య చకితులయారు. అనంతరం ఆలయప్రాంగణం, నెమలిగుండం లను తిలకించారు. లక్ష్మమ్మ వనంలో నెమలిగుండ్ల రంగస్వామి దేవేరి లక్ష్మీ దేవిని దర్శించుకొని పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్బంగా రంగస్వామి సేవను కలెక్టర్ తిలకించారు. రంగస్వామి సేవ నిర్వహించే వ్యక్తులు అగ్ని కాగడాను ముద్దాడటం , వస్త్రం పై కగాడా ను ఉంచటం , ఇతర అనేక విన్యాసాలు ప్రదర్శించారు, దాంతో కలెక్టర్ రాజబాబు ఆశ్చర్యం వెళ్లబుచ్చారు. అనంతరం నిర్ణయించిన ప్రకారం అన్నిశాఖల అధికారులతో ఎమ్మెల్యే అశోకరెడ్డి తోకల్సి బ్రహోత్సవాలకు ఏర్పాట్ల గురించి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికాసంఖ్య లో పోలీస్ బలగాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధికారులు బ్రహోత్సవాలను నిర్మావహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, టైగర్ ప్రాజక్ట్ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి , డిఎస్పీ నాగరాజు ఆలయ ఈఓ నాగయ్య, పలువురు తహశీల్దార్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 14**

గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రాజాబాబు, గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ఔషధాల అందుబాటు వంటి అంశాలను వారు సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సేవలను, మిషనరీ విధానంను క్షుణ్ణంగా పరిశీలించారు. రక్త పరీక్షలు నిర్వహించే కేంద్రాన్ని అత్యాధునిక టెక్నాలజీ ద్వారా రక్త పరీక్షలు నిర్వహించే పరికరాలను నూతన బిల్డింగు నిర్మాణ పనులు, పూర్తి చేయాలని ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలి అని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను వెంటనే గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రజ్ఞ 2కె26 పోస్టర్ ఆవిష్కరణ



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 14**

దరిమడుగులోని ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రజ్ఞా 2కె26 పోస్టర్ ను వి.హెచ్.ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 15,16,17 వ తేదీలలో కళాశాలలో జాతీయస్థాయి సాంకేతిక, సంస్కృతిక , క్రీడా ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంకేతిక కార్యక్రమాలలో భాగంగా పవర్ పాయింట్, పోస్టల్ ప్రజెంటేషన్, క్విజ్, సంస్కృతిక కార్యక్రమాలలో డ్యాన్స్, క్రీడలలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ జరుగుతాయని తెలిపారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు సుమారు లక్ష వరకు బహుమతులు అందజేయనున్నట్టు కళాశాల యజమాన్యం తెలిపారు. ఈవెంట్ లలో పాల్గొనే ప్రతి విద్యార్థి వంద రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.శంకర్ బాబు, డిప్లమా ఇంచార్జ్ మాధవి, వివిధ విభాగాల హెచ్.ఓ.డి లు, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాణికులకు గుడ్ న్యూస్..

# నాలుగు ప్రత్యేక రైళ్లు ఇక రెగ్యులర్!



**విశాఖపట్నం, పెన్ పవర్ మార్చి 14**

రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. డిమాండ్ మేరకు నడుపుతున్న నాలుగు ప్రత్యేక రైళ్లను ఇకపై రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మారుస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి మెరుగైన కనెక్టివిటీ లభించనుంది.

రెగ్యులర్ కానున్న రైళ్ల వివరాలు:

**1 విశాఖపట్నం – తిరుపతి (18507/18508):**

షెడ్యూల్: ప్రతి సోమవారం రాత్రి 19.10 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 09.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం: ప్రతి మంగళవారం రాత్రి 21.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

ఆగు స్టేషన్లు: దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా ప్రయాణిస్తుంది.

**2. విశాఖపట్నం -- తిరుపతి (18505/18506):**

షెడ్యూల్: ప్రతి బుధవారం రాత్రి 19.00 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 09.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం: ప్రతి గురువారం రాత్రి 21.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

**3. విశాఖపట్నం -- బెంగళూరు (18509/18510):**

షెడ్యూల్: ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15.20 గంటలకు విశాఖలో బయలుదేరి, సోమవారం మధ్యాహ్నం 13.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం: ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు బెంగళూరులో బయలుదేరి, మంగళవారం మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

**4. విశాఖపట్నం -- చర్లపల్లి (హైదరాబాద్) (18527/18528):**

షెడ్యూల్: ప్రతి శుక్రవారం సాయంత్రం 17.30 గంటలకు విశాఖలో బయలుదేరి, శనివారం ఉదయం 08.00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం: ప్రతి శనివారం మధ్యాహ్నం 14.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, ఆదివారం తెల్లవారుజామున 05.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైళ్లు రెగ్యులర్ సర్వీసులుగా అందుబాటులోకి వచ్చే తేదీలను త్వరలోనే రైల్వే శాఖ అధికారికంగా ప్రకటించనుంది. కోచ్‌లలో 2ఏసీ , 3ఏసీ , స్లీపర్ మరియు జనరల్ క్లాస్ సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయి.

# స్ప్రింగ్ బోర్డు స్కూల్ కరాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 14**

స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ లో శనివారం కరాటే మాస్టర్ షాశావాలి ఆధ్వర్యంలో కారాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహిచారు. ఈకార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ జెవి నారాయణ ప్రిన్సిపల్ శ్వేత ప్రియదర్శిని , డైరెక్టర్ మణి చైతన్య హాజరయ్యారు. బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కు మొత్తం 80 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ బెల్ట్ టెస్ట్ లో వైట్ బెల్ట్ నుంచి ఎల్లో బెల్టుకు ఎల్లో బెల్ట్ నుంచి ఆరెంజ్ బెల్టుకు ఆరెంజ్ బెల్ట్ నుంచి బ్లూ బెల్టుకు బ్లూ బెల్ట్ నుంచి పర్పుల్ బెల్టుకు పర్పుల్ నుంచి బ్రౌన్ కు ప్రమోట్ చేయబడ్డారు. ఈ టెస్ట్ కు చీఫ్ ఎగ్జామినర్ గా నల్లూరి మోహన్ రావు – బ్లాక్ బెల్ట్ సెవెంత్ డాన్, సిద్ధార్థ కరాటే అండ్ షికోకాయి ఏపీ టెక్నికల్ డైరెక్టర్ వ్యవహరించారు. మార్కాపురం జిల్లా సిద్ధార్థ కరాటే షికోకాయి మాస్టర్లు సయ్యద్ షాషావలి, పి. చాంద్ బాషా ఫోర్త్ డాన్, పీవీ సుబ్రహ్మణ్యం ఫోర్త్ డాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ క రెస్పాండెంట్ డాక్టర్ జెవి నారాయణ పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు మరింత ఉత్సాహంతో కరాటే పోటీల్లో చురుగ్గా పాల్గొనాలని పిల్లలను ఉద్దేశించి ప్రశంసించారు. ప్రిన్సిపల్ శ్వేత ప్రియదర్శిని మాట్లాడుతూ పిల్లలను ఇంత ప్రోత్సాహకరంగా ముందుకు నడిపిన తల్లిదండ్రులను కూడా ప్రశంసించారు.

# 10 వ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

***బీజేపీ రాష్ట్ర నేత డాక్టర్ ఏలూరి***

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 14**

ఈ నెల 16 వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థులకు బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఎక్కడ కూడా ఒత్తిడికి గురి గాకుండా, ప్రశాంతత,ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.సంవత్సరం పొడవునా చేసిన కృషి ఫలితాన్ని చూపించే సమయం ఇదేనని, ప్రతి విద్యార్థి ప్రశాంతంగా ప్రశ్నపత్రాన్ని సమాధానపరిచి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలకు వెళ్లే ముందు తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశిస్తూ, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ధైర్యం చెప్పి వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు.



# ఏడేళ్ల చిన్నారికి రూ.2 లక్షల సాయం

## వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత ఆపన్నహస్తం



**విశాఖపట్నం, పెన్ పవర్ మార్చి 14**

విశాఖపట్నం పర్యటనలో భాగంగా ఈ నెల 4వ తేదీన నగరానికి వచ్చిన సందర్భంగా, 39వ వార్డుకు చెందిన ఏడేళ్ల చిన్నారి జోయ మహమ్మద్ తీవ్ర బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న పరిస్థితిని ఆమె తండ్రి ఎండీ హఫీజ్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి కి వివరించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన జగన్ , ఆ చిన్నారి వైద్య చికిత్స కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ రోజు ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న వారి నివాసానికి వెళ్లిన జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు, విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కలిసి రూ.2 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కేకే రాజు మాట్లాడుతూ... వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటిలో ఆయన కుమారుడి వివాహ వేడుకల సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించేందుకు వచ్చిన సమయంలో చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా తీవ్రమైన వ్యాధితో బాధపడుతూ కమ్యూనికేషన్ సమస్యలతో ఉన్న ఆ చిన్నారిని 2023లో వాసుపల్లి గణేష్ కుమార్ స్వయంగా వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారని పేర్కొన్నారు. అదే సమయంలో చిన్నారి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించేందుకు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి తో మాట్లాడి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా సుమారు రూ.18 లక్షలు మంజూరు చేసి చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ చిన్నారి ప్రాణాలు నిలబడ్డాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడం..కూటమి ప్రభుత్వం అధికారం చెప్పడం జరిగింది. చికిత్స కోసం మంజూరు చేసిన డబ్బులు రానివకుడా ఆపివేశారు. చిన్నారి తండ్రి రేషన డిపో డ్రైవర్ గా , తల్లి వాలంటీర్ గా పని చేసువారు కాని ఎప్పుడు అవికూడా ఈ ప్రభుత్వ అప్పి వేయడం తో ప్రస్తుతం ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వారి జీవనోపాధి కూడా దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వ వ్యవస్థలు మానవత్వంతో స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య శాఖలో జరుగుతున్న నిర్లక్ష్యం, అవినీతి కారణంగా సాధారణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని స్పందించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. మీడియా సమావేశాలు, ప్రచారాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వచ్చి వారి పరిస్థితులను తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ని కోరారు. ఈ సంఘటన రాష్ట్రంలో ప్రజలు ఆరోగ్య సేవలు, జీవనోపాధి కోల్పోయి ఎలా ఇబ్బందులు పడుతున్నారనే దానికి నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బాధ్యత తీసుకుని, నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ...:** రాష్ట్రంలో ఇలాంటి బాధిత కుటుంబాలు ఎన్నో ఉన్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నార లోకేష్ కళ్ళు తెరిచి ప్రజల పరిస్థితిని చూడాలని కోరారు. ఇలాంటి బాధిత కుటుంబాలను ఆదుకోవడంలోనే నిజమైన గొప్పతనం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి హయాంలో “నావల్ల ఎవరికీ అన్యాయం జరగకూడదు, ఎవరికీ నష్టం కలగకూడదు” అనే బాధ్యతతో పాలన సాగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స కోసం వెళ్లే రోగులకు అవకాశం లేదని చెబుతూ తిరస్కరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా డబ్బులు చెల్లించండి, తరువాత బిల్లులు పెట్టుకోండి అని చెప్పడం పేదలకు పెద్ద భారమవుతోందన్నారు. అలాగే విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లో వైద్యులపై అధిక ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ఒక రోజులో సాధారణంగా నాలుగు ఆపరేషన్లు జరిగే చోట 13 ఆపరేషన్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తగినంత మంది వైద్యులు, నర్సులు లేకపోవడం వల్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ కాలంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, ఎస్.ఇ.సి సభ్యులు జహీర్ అహ్మద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజు గాంధీ, జోనల్, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులు ముత్తం సునీల్, అంబటి శైలేష్, బోండా ఉమామహేశ్వరరావు, పేలా ప్రేమ్ కిరణ్, వార్డు అధ్యక్షులు ముజుబ్ ఖాన్, బొడ్డేటి ప్రసాద్, అల్లాను కనక రెడ్డి, పార్టీ నాయుకులు ఎస్.కే బాబ్జి , పొంతిన హరికృష్ణ, సత్య , మాదిరి , శ్రీను, రమన్ , సాయి , చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15 చినగానివల్లె లో మోల్లాలి స్వామి జాతర ఘనంగా

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 14**

రాచర్ల మండలం చినగానివల్లె గ్రామంలో శ్రీ మోల్లాలి స్వామి జాతరగుతుందని పీర్లచావిడి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది ఈ సందర్భంగా ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ జాతరకు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్నట్లు అందుకు తగిన ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.



# ఆటవిక పాలన సాగింది.. అభివృద్ధి కుంటిపడింది.. జగన్ కాల పాలనపై ఎమ్మెల్యే కిమిడి..

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 14** జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పరిపాలించిన ఐదేళ్ల కాలంలో ప్రజాస్వామ్యం కూని చేయడంతో పాటు ఆటవిక పాలన కొనసాగి రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం మొత్తం కుంటిపడిందని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. శనివారం నాడు చీపురుపల్లి మండలం అలజంగి ప్రధాన రహదారి నుండి గొల్లల ములగాం గ్రామం వరకు ప్రభుత్వ నిధులతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు చంద్రబాబు నాయుడు పాలనలో మంచి ఫలాలను అందించే మొక్కలను నాటారన్నారు. తరువాత ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని నియంత పాలనలో కొనసాగిస్తూ సంక్షేమాన్ని అభివృద్ధిని కుంటుపరిచారన్నారు. అధికారులను గాని కష్టజీవులను గాని ఆఖరికి ఆ పార్టీ నాయకులు గానీ చెప్పింది వినకుండా నియంతల పరిపాలించడం వలన రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిపోయింది అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గత పాలనలో కుంటుపడిన అభివృద్ధిని దశలవారీగా రాష్ట్ర ముఖ్యమంత్రి సీనియర్ నాయకులు చంద్రబాబు నాయుడు సారాధ్యంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సతశాతం నెరవేరుస్తున్నామన్నారు. ఎన్నికల ముందు పెన్షన్ల పెంపుదల కోసం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని 100% పూర్తి చేసామని, జగన్ ప్రభుత్వ పాలనలో పెన్షన్ దారులను మోసం చేసి సుమారు పదివేల కోట్లను దోచుకున్నారన్నారు. వైయస్ పాలనలో సైతం తిరుమల దేవస్థానానికి సంబంధించి రెండు కొండలు ఉన్నాయంటూ వ్యాఖ్యలు చేయడం, రాజారెడ్డి పాలన కొనసాగించడం వల్లే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటికే నాబార్డ్ ఎన్ఆర్జిఎస్ ఆర్ అండ్ బి తదితర శాఖల నుండి సుమారు 25 వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టమని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజలకు అందుబాటులో మెరుగైన సేవలు అందజేయడానికి కూటమి పాలకులు, చంద్రబాబునాయుడు సారాధ్యంలో నిరంతరం కృషి జరుపుతున్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కామ నాయుడు, దన్నాన రామచంద్రుడు, అలజంగి ఎంపీటీసీ సనాపతి శ్రీనివాసరావు, రౌతు నారాయణరావు, రావివలస సర్పంచ్ పనస మణికంఠ, తాసిల్దార్ డి ధర్మరాజు, ఆర్ అండ్ బి అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు



పేరిపి గొల్లలములగాం, అలజంగి, చీపురుపల్లి తదితర ప్రాంతాల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు...

## రూ.3 కోట్లతో చీపురుపల్లిచినడిపల్లి రహదారికి శంకుస్థాపన చేసిన కళా వెంకటరావు



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 14:** ఈరోజు చీపురుపల్లి లావేరు రోడ్డునుంచి చినడిపల్లి వరకు (వయా: పేరిపి, ఇటికర్లపల్లి, గొల్లల ములగాం) కి.మీ 0/0 నుండి 10/9 వరకు రూ.3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రహదారి పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రివర్యులు మరియు చీపురుపల్లి శాసనసభ్యులు లిశ్రీ కిమిడి కళా వెంకటరావు లి పాల్గొని రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణం వలన పేరిపి, ఇటికర్లపల్లి, గొల్లల ములగాం ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదం చేయనుందని ఆయన తెలిపారు.

ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామునాయుడు, అలజంగి ఎంపీటీసీ శనపతి శ్రీను, రావివల సర్పంచ్ పనస మణికంఠ, మాజీ ఆర్ ఇ సి ఎస్ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, ఇతర మండల నాయకులు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## పన్నుల వసూలను వేగవంతం చేయాలి.. డి. డి .ఓ కే. హేమ సుందర్..



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 14.** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీల వారీగా యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన ఇంటి పన్నుల వసూల కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని చీపురుపల్లి డి. డి. ఓ ,కే హేమ సుందర్ పంచాయతీ అధికారులకు సిబ్బందికి సూచించారు. శనివారం నాడు చీపురుపల్లి గ్రామపంచాయతీ ఏరియాలో 2025 26 సంవత్సరం వరకు బకాయి ఉన్న ఇంటి పన్నులు వసూళ్లు చేస్తున్న పంచాయతీ అధికారులు పనిని ఆయన పరిశీలించారు. పంచాయతీల వారీగా సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధను కనబరిచి పన్నుల వసూలను జరపాలని ఆయన వివరించారు. ఇంటి పనులు వసూల ద్వారా పంచాయతీ అభివృద్ధికి నిధులు సమకురుతాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ రాణి సూపర్వైజర్ ఎన్ రామ్మోహన్రావు, ఈశ్వరరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## దారకొండ ఘాటీలో జేసీబీ ధ్వంసం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి14:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని ఆర్వీనగర్‌పాలగెడ్డ రహదారి నిర్మాణ పనుల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దారకొండ ఘాటీ వద్ద రోడ్డు చదును చేసే పనులు నిర్వహిస్తున్న ఐఆర్ కన్స్ట్రక్షన్ సంస్థకు చెందిన జేసీబీ యంత్రంపై శుక్రవారం రాత్రి దుండగులు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో జేసీబీ అద్దాలు ధ్వంసమయ్యాయి. సుమారు రూ.18 కోట్ల వ్యయంతో నెల క్రితమే ప్రారంభమైన ఈ రహదారి నిర్మాణ పనులకు అడ్డంకులు ఏర్పడటంపై కాంట్రాక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని, దీంతో పనులు కొనసాగించడంపై కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# జన సైనికుల త్యాగం మరువలేనిది



– పేడాడ రామ్మోహన్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 14 :** జనసేన పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలు ఆమదాలవలస జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్ రావు జెండాను ఎగరవేశారు. జనసేన పార్టీ ఆవిర్భవించి 13 సంవత్సరాలు అయ్యింది, ప్రతి కార్యకర్త పార్టీ విజయానికి కృషి చేస్తున్నారని పేడాడ రామ్మోహన్ రావు అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో ప్రతి కార్యకర్త సైనికుల పనిచేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం జోరుగా సాగుతుందని ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకొని జనసేన పార్టీ అవలంబిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో తీసుకొని వెళ్లవలసిన బాధ్యత ప్రతి జన సైనికుడిపై ఉందన్నారు. ప్రతి జనసైనికుడికి పార్టీ అండ ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం లక్ష్మీ నగర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వందమంది విద్యార్థులకు అట్టలు, పెన్నాలు, పెన్సిల్స్, ఎరేజర్స్, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్దులను బాగా చదువుకోవాలని పదవ తరగతిలో మంచి మార్కులు సాదించడంతో పాటు ఉన్నత చదువులకు ఎదగాలని పేడాడ రామ్మోహన్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాత్రని పాపారావు, బగాది తేజేశ్వరరావు, డా. పైడి నరేష్ కుమార్, ఎస్ గణేష్, కీర్తి సుశీల మరియు జనసైనికులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే జనసేన ధ్యేయం



**పెన్ పవర్, విజయనగరం టౌన్ మార్చి 14 :** ప్రజా సంక్షేమమే జనసేన ధ్యేయమని జనసేన నేతలు పాలవలస యశస్వి , గురాన అయ్యలు అన్నారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిపారు.

ముందుగా జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి అనంతరం కేక్ కటింగ్ చేసి ఆవిర్భావ సంబరాలు చేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్బంగా పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేసి అనంతరం రక్తదాన శిభిరం ఏర్పాటు చేసి రక్తదానం చేసారు.

డొక్కా సీతమ్మ పేరుతో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. “నేను ప్రశ్నించడానికే వచ్చాను“ అంటూ పవన్ కళ్యాణ్ అనే ఒకే ఒక్కడు ఎగరేసిన జనసేన జెండా, నేటికి 13 వసంతాల అలుపెరుగని ప్రయాణాన్ని పూర్తి చేసుకుందని జనసేన నేతలు పాలవలస యశస్వి ,గురాన అయ్యలు అన్నారు. ఓటమి వెక్కిరించినా, అవమానాలు చుట్టుముట్టినా, ప్రజల పక్షాన నిలబడాలనే పవన్ కళ్యాణ్ సిద్ధాంతమే ఈ 13 ఏళ్ల ప్రస్థానానికి ఆయువుపట్టుని తెలిపారు. కేవలం రాజకీయ పార్టీగా కాకుండా, ఒక సామాజిక విప్లవంగా జనసేన రూపుదిద్దుకుందన్నారు. రాజకీయాల్లో నాయకుడు అంటే కేవలం ఓట్లు అడిగేవాడు, హామీలు ఇచ్చేవాడు కాదని.. కష్టాల్లో కన్నీళ్లు తుడిచి, ఆదుకునేవాడని పవన్ కళ్యాణ్ తన చేతలతో నిరూపించారని, పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలే తన బలమని, వారే తన కుటుంబమని నమ్మి, వారికి బీమా సౌకర్యం కల్పించి అండగా నిలవడం జనసేన నైజమన్నారు. విమర్శలు, కుట్రలు, అపజయాలు.. ఎన్నో ఎదురైనా, మొక్కవోని దీక్షతో సాగిన ప్రయాణానికి 2024 ఎన్నికల ఫలితం ఒక మధురమైన ప్రతిఫలమని తెలియజేసారు. సాధించిన అద్భుత విజయం జనసేన ప్రస్థానంలో ఒక చారిత్రక మైలురాయిని అన్నారు.

కేవలం పార్టీ ప్రయోజనాల కంటే రాష్ట్ర భవిష్యత్తే మిన్న అని భావించి, కూటమి ఏర్పాటులో పవన్ కళ్యాణ్ చూపిన రాజకీయ పరిణతి, ఆయన నిస్వార్థానికి నిలువుటద్దమని, అధికారం కోసం ఆరాటం కాదు, ప్రజల కోసం పోరాటం అనే నినాదంతో సాగుతున్న జనసేన ప్రస్థానం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జనసేన నాయకులు, వీర మహిళాలు, జన సైనికులు పాల్గొన్నారు.

## విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయకూడదు -కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

### పైపులైన్ కనెక్షన్లపై ఎమినిటి సెక్రటరీస్, మున్సిపల్ అధికారులతో సమీక్ష



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 14:** నగరంలో జరుగుతున్న డ్రైనేజీ పనులు మరియు మంచినీటి పైపులైన్ల పనులపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ అధికారులు, శానిటరీ అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ వార్డుల్లో ఎంతవరకు పనులు జరిగాయని రిపోర్టు రూపంగా చూపించాలని కలక్టర్ సంబంధిత ఎమినిటి సెక్రటరీలను ప్రశ్నించారు. వారి సమాధానాలతో సంతృప్తి చెందని కలెక్టర్ సంబంధిత అధికారుల ఉద్దేశించి ప్రజారోగ్యం ప్రమాదంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాల్సిన వారు ఎందుకు విఫలమవుతున్నారనీ, ఎవరు చేయాల్సిన పనులు వారు సకాలంలో పూర్తి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని గుర్తుచేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో లోపాలు, పైపులైన్ల కనెక్షన్లు,పారిశుధ్య నిర్వహణలో వైఫల్యాలు కనిపిస్తున్నాయని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించడం వల్లే డయేరియా వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో ప్రజల సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పైపులైన్ల పనులు సకాలంలో పూర్తి చేయాలని, లీకేజీలు, మురుగునీటి కాలువల పూడికతీత పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎం.హెచ్.ఓ డా. సుధీర్, అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, డి.ఇ.ఇ. రవిశర్మ, ఎ. ఈలు, సత్యనారాయణ, సందీప్, రాజేష్, ఎ.ఒ. మంగమ్మ, ఎమినిటి సెక్రటరీస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి :



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 14 :** జిల్లాలో పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రామసందర్ రేడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 119 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా జిల్లాలోని 449 పాఠశాలల నుండి 22,961 మంది రెగ్యులర్ విద్యార్థులు (బాలురు 11,487, బాలికలు 11,474) మరియు 564 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, అదనంగా ఓపెన్ స్కూల్‌కు చెందిన 631 మంది విద్యార్థులు ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ వివరించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, సరిపడే బెంచీలు, వైద్య సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు.

పరీక్షల నిర్వహణకు 119 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 119 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 3 మంది అదనపు డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 1210 మంది ఇన్విజిలేటర్లు ను నియమించామని, అదనంగా 7 ఫ్లయింగ్ స్క్వాడ్లు మరియు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసామని తెలిపారు. ప్రశ్నాపత్రాల పంపిణీకి 9 రూట్లు, భద్రపరచడానికి 29 పోలీస్ స్టేషన్లను స్టోరేజ్ పాయింట్లుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**144 సెక్షన్ అమలు:**

పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పర్యవేక్షిస్తుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

విద్యార్థులు తమ హాల్ టికెట్‌లో ఉన్న ఞ= కోడ్ సహాయంతో పరీక్షా కేంద్రానికి సులభంగా చేరుకోవచ్చని, హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాలకు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. అనివార్య కారణాల వల్ల ఆలస్యంగా వచ్చే విద్యార్థులను ఉదయం 10 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు.

**నో ఫోన్ జోన్:**

అన్ని పరీక్షా కేంద్రాలను “నో ఫోన్ జోన్” గా ప్రకటించామని, ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురాకూడదని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం పరీక్షలకు సంబంధించిన సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్‌ను 08922-351399, 7382157686 ఫోన్ నంబర్లతో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# ఉగాదికి పట్టాభిషేకమా...

**తిరుపతి, మార్చి 14, పెన్ పవర్:** ప్రస్తుతం ఏపీలో ఉగాది పై చర్చ సాగుతోంది. ఆరోజు ఏపీ రాజకీయాలను షేక్ చేసేలా పలు నిర్ణయాలు ఉంటాయని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా అధికార పగ్గాల మార్పు గురించి రాష్ట్రమంతటా జోరుగా చర్చ జరుగుతోంది. సీఎం పీఠంపై లోకేష్ ను కూర్చోబెడతారు అనే ప్రచారం ఒకటి ఉంది. అయితే ఇది సాధ్యం కాకపోవచ్చు కానీ.. మంత్రివర్గంలో భారీ మార్పులు చేసే అవకాశం మాత్రం కనిపిస్తోంది. ముఖ్యంగా లోకేష్ టీం ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తెస్తారన్న ప్రచారం మాత్రం పతాక స్థాయిలో జరుగుతోంది. ఇప్పటికే దీనిపై స్పష్టమైన సంకేతాలు టిడిపి శ్రేణులకు వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో మార్పులకు సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు మాత్రం సమాచారం. లోకేష్ కీలక బాధ్యతలపై అనేక రకాల చర్చలు జరుగుతుండగా.. బిజెపితో పాటు జనసేన స్పందన ఎలా ఉంటుంది అనేది ఇప్పుడు హాట్ టాపిక్. అయితే గతానికి భిన్నంగా లోకేష్ పై ఉన్న అభిప్రాయం బిజెపికి మారింది. లోకేష్ నాయకత్వాన్ని బిజెపి ప్రోత్సహించే అవకాశం ఉంది. ఎందుకంటే రాష్ట్ర రాజకీయాల్లో వారసత్వ మార్పులు జరిగినప్పుడు తమ పార్టీకి కూడా ఎదిగే అవకాశం దొరుకుతుందని బిజెపి లెక్కలు వేసుకుంటుంది.. బీహార్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి తమ ఉనికిని చాటుకున్నట్లే.. ఇక్కడ కూడా అదే ఆలోచన చేసే అవకాశం ఉంది.రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. కానీ బలమైన ఓటు బ్యాంకుతో పటిష్ట స్థితిలోనే ఉంది. అందుకే కూటమి పార్టీలు చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. అయితే ఇప్పటికిప్పుడు లోకేష్ పట్టాభిషేకం ఉండకపోవచ్చు. ముందుగా లోకేష్ టీం తో పటిష్ట పరుస్తారు. తరువాతే లోకేష్ ను ప్రమోట్ చేస్తారు. అయితే ఇప్పట్లో చంద్రబాబును మార్చే అవకాశం లేదు. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే కాబోలు. అయితే కచ్చితంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రామయ్య కళ్యాణానికి అంతా సిద్ధం

**కడప, మార్చి 14, పెన్ పవర్:** మార్చి 26 గురువారం నుంచి ఏప్రిల్ 05 ఆదివారం వరకు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఏప్రిల్ 1 సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం జరుగుతుందికడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మార్చి 26 నుంచి ఏప్రిల్ 05 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో మార్చి 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మార్చి 26న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు కన్నులపండువగా నిర్వహిస్తారు

**బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరంగా**

2026 మార్చి 27 శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.15 గంటల వరకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీరామనవమి ఆస్థానం

సాయంత్రం 4 గంటల నుంచి పోతన జయంతి, కవి సమ్మేళనం జరుగుతుంది

ఇదే రోజు రాత్రి శేష వాహనంపై స్వామివారు విహరిస్తారు

మార్చి 28 శనివారం ఉదయం వేణుగానాలంకారం, శనివారం రాత్రి హంస వాహన సేవ

మార్చి 29 ఆదివారం ఉదయం వటపత్రశాయి అలంకారం, ఆదివారం రాత్రి సింహ వాహన సేవ

మార్చి 30 సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారం, సోమవారం రాత్రి హనుమంత వాహన సేవ

మార్చి 31 మంగళవారం ఉదయం మోహినీ అలంకారం, మంగళనాపం రాత్రి గరుడవాహనసేవ జరుగుతుంది

ఏప్రిల్ 1 బుధవారం ఉదయం శివధనుర్భాణ అలంకరణ, మధ్యాహ్నం 03.15 గంటలకు కాంత కోరిక, ఎదుర్కోలు ఉత్సవం. ఇదే రోజు సాయంత్రం 06.30 గంటల నుంచి 08.30 గంటల వరకు శ్రీ సీతారామ కల్యాణోత్సవం, ఈ రోజు రాత్రి గజవాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహిస్తారు

ఏప్రిల్ 02 గురువారం ఉదయం రథోత్సవం

ఏప్రిల్ 03 శుక్రవారం ఉదయం కాళీయమర్ధనాలంకారం, రాత్రి అశ్వవాహన సేవ జరుగుతుంది

ఏప్రిల్ 04 శనివారం ఉదయం చక్రస్నానం...రాత్రి ధ్వజావరోహణం.

ఏప్రిల్ 05వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు

2026 మార్చి 27 శుక్రవారం శ్రీరామనవమి, భద్రాచల క్షేత్రంలో సీతారాముల కళ్యాణోత్సవం జరుగుతుంది. పౌర్ణమి రోజు ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణం జరుగుతుందికడప జిల్లా ఒంటిమిట్టలో ప్రసిద్ధి కోదండరామాస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. సాధారణంగా నవమి రోజు కాకుండా చైత్ర పౌర్ణమి రోజు అంటే..నవమి తర్వాత దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్థశి ముగిసిన తర్వాత పౌర్ణమి రోజు వెన్నెల వెలుగులో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తారు. ఏపీ ప్రభుత్వం ఈ వేడుకను అధికారికంగా నిర్వహిస్తుంది

ఈ ఏడాది ఏప్రిల్ 1 న నిండు పౌర్ణి రాత్రి వెన్నెల వెలుగుల్లో సీతారాముల కళ్యాణం జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తాయి. బ్రహ్మోత్సవాలు మార్చి 27 నుంచి ప్రారంభమవుతాయి.. ముందు రోజు మార్చి 26న అంకురార్పణతో ఉత్సవాలు మొదలవుతాయి. రెండో భద్రాద్రిగా పిలిచే ఒంటిమిట్టలో రామచంద్రుడు.. సీతా, లక్ష్మణులతో కొలువై ఉంటాడు. ఈ ఆలయంలో ఆంజనేయుడు ఉండడు.

## అనిత ఎందుకో లాస్ట్...

**విశాఖపట్టణం, మార్చి 14, పెన్ పవర్:** ఏపీలోటీడీపీ కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. ప్రతి 15 రోజులకు మంత్రి మండలి సమావేశం. ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల రివ్యూ కొనసాగుతూ వస్తోంది. అదే సమయంలో మంత్రులకు ర్యాంకింగ్, వారి పనితీరు మదింపు వంటి విషయంలో సీఎం చంద్రబాబు ముందు ఉంటున్నారు. వారికి ర్యాంకింగ్స్ ఇస్తున్నారు. తాజాగా కలెక్టర్ల రివ్యూలు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇచ్చారు చంద్రబాబు. ఈ ర్యాంకింగ్స్ లో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు తొలి స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగో స్థానంలో నిలిచారు. మంత్రుల శాఖలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ విషయంలో ఈ ర్యాంకింగ్స్ ఇచ్చారు సీఎం చంద్రబాబు. మంత్రుల శాఖల ప్రగతిలో ఈ ఫైల్ క్లియరెన్స్ కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే సీఎం చంద్రబాబు దీనిపైనే స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. మంత్రుల పనితీరుపై మదింపు.. అమరావతిలో కలెక్టర్ల సమావేశం తొలి రోజున మంత్రుల పనితీరుపై హాట్ కామెంట్స్ చేశారు సీఎం చంద్రబాబు. ఆయా శాఖల్లో ఫైళ్ళ క్లియరెన్స్ ఎంత వేగంగా జరుగుతుందని అంశంపై మిత్రులందరికీ రేటింగ్స్ ప్రకటించారు. తొలి స్థానంలో కింజరాపు అచ్చెనాయుడు నిలిచారు. ఆ తరువాత స్థానాల్లో వరుసగా నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగు స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో నిలిచారు. మంత్రులు తమ ఫైళ్లను క్లియర్ చేసేందుకు ఎంత సమయం తీసుకుంటున్నారో చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాలు వేగంగా పూర్తి అయ్యేలా త్వరగా ఫైళ్లను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు సీఎం చంద్రబాబు. పాలనలో వేగం పెంచడం ద్వారా.. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వెల్లడించారు.ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల సమావేశం జరపడం ఆనవాయితీగా పెట్టుకున్నారు సీఎం చంద్రబాబుఅందులో భాగంగా నిన్ననే అమరావతిలో కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈరోజు కూడా అది కొనసాగనుంది. కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. శాఖల ఆదాయంపై కూడా సమీక్షిస్తారు. రాష్ట్ర విద్యారంగం తో పాటు ఉపాధి అవకాశాలపై కూడా చర్చించనున్నారు ఈరోజు సమావేశంలో. కోర్టులో ఉన్న కేసులు, న్యాయశాఖ పరిధిలో ఉన్న అంశాల పైన అధికారులు సీఎంకు వివరాలు అందించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి కీలక నిర్ణయం కూడా ఈరోజు తీసుకోనున్నారు. తొలిరోజు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇవ్వగా.. ఈరోజు అధికారులకు ర్యాంకింగ్స్ ఇవ్వనున్నారు సీఎం చంద్రబాబు.

# కూటమిలో పైన పటారం..లోన లోటారం

**విజయవాడ, మార్చి 14 , పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , బీజేపీ అగ్రనేతలు అత్యంత సమన్వయంతో, ఒకే మాట – ఒకే బాట అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. కానీ, క్షేత్రస్థాయి నియోజకవర్గాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పాత కక్షలు, ఆధిపత్య పోరాటాలు కూటమి నేతల మధ్య చిచ్చు పెడుతున్నాయి. కదిరిలో బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి గృహనిర్బంధం ఘటన ఈ అంతర్గత విభేదాలకు ఒక నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. రాజకీయేతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకోవాలని చూడటం కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకొనేలా చేస్తోంది.కదిరి తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో ఈ హైపర్ లోకల్ పోరు ముదురుతోంది. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో తమకు కనీస గౌరవం దక్కడం లేదని ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే పార్టీ కాకుండా ఇతర పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. నిడదవోలు, తిరుపతి సహా చాలా చోట్ల ఇలాంటివి బహిరంగ వివాదాలకు కారణం అయ్యాయి. మెజార్టీ నియోజకవర్గాల్లో పార్టీల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పాత ప్రత్యర్థులుగా ఉన్న నేతలు ఇప్పుడు ఒకే గొడుగు కిందకు వచ్చినా, మనసులు మాత్రం కలవలేదని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయి.నామినేటెడ్ పోస్టుల పంపిణీ విషయంలో కూడా కింది స్థాయి కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. జనసేన , బీజేపీ శ్రేణులు తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని భావిస్తుంటే, పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి పోరాడిన తమను కాదని కొత్తగా వచ్చిన




వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారని టీడీపీ క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ పవర్ షేరింగ్ చిక్కుముడిని విప్పకపోతే, అది రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ఆధిపత్య పోరాటం ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు కూడా పాకుతున్నాయి. కదిరి రథోత్సవంలో విష్ణువర్ధన్ రెడ్డికి పర్మిషన్ లేదని టీడీపీ ఎమ్మెల్యే హుకుం జారీ చేయడం, బీజేపీ–టీడీపిల మధ్య ఉన్న దూరాన్ని పెంచింది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వైసీపీ వంటి ప్రతిపక్షాలు దీన్ని అస్త్రంగా మార్చుకుని, కూటమిలో ఐక్యత లేదు అనే ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ఇది కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి ఫలాలను ప్రజలు గుర్తించకుండా చేస్తోంది. పై స్థాయిలో ఎంత ఐక్యత ఉన్నా, కింది స్థాయిలో కార్యకర్తలు, నాయకుల మధ్య సయోధ్య లేకపోతే అది సమస్యగా మారుతుంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మాధవ్ వెంటనే జోక్యం చేసుకుని నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీలను పటిష్టం చేయకపోతే, ఈ ఆధిపత్య పోరాటం చిలికి చిలికి గాలివానలా మారి కూటమిని ఇబ్బందుల్లోకి నెట్టే ప్రమాదం ఉందన్న భావన వ్యక్తమవుతోంది.

# ఇండియాలో ఫస్ట్...
# మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్

**నెల్లూరు మార్చి 14, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు వేదిక అయింది. దేశీయ సముద్ర సాంకేతికత , రక్షణ రంగ ఉత్పత్తిని బలోపేతం చేసే దిశగా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బోగోలు మండలం బంగాళాఖాతం తీరంలో ఈ కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూమిపూజ నారా లోకేష్ చేతుల మీదుగా జరిగింది. దాదాపు 29.58 ఎకరాల విస్తీర్ణంలో మొదటి విడతగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో స్వయంప్రతిపత్తి కలిగిన నౌకల నిర్మాణం , పరిశోధన మరియు అభివృద్ధి , షిప్ మెయింటెనెన్స్ అండ్ రిపేర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉండనున్నాయి. ప్రధానంగా రక్షణ, వాణిజ్య , తీరప్రాంత భద్రతా అవసరాల కోసం మానవరహిత ఉపరితల నౌకలు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్ డిజైన్ చేయడం, నిర్మించడంపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెరైన్ రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఇక్కడ వినియోగించనున్నారు.ఈ కేంద్రం ఏర్పాటుతో రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ ఊతం లభించనుంది. దీని ద్వారా దాదాపు 300 మందికి పైగా ఇంజనీర్లు, నేవల్ ఆర్కిటెక్టులు , ఇతర సాంకేతిక నిపుణులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. అంతేకాకుండా, ఇక్కడి ఎంఆర్ఓ ఫెసిలిటీ వల్ల స్థానిక మత్స్యకారుల బోట్లు, కోస్ట్‌గార్డ్ , నేవీ నౌకల మరమ్మతులు వేగంగా జరిగి, పనిదినాల నష్టం తగ్గుతుంది. మత్స్యకారులకు రియల్ టైమ్ ఫిష్ లొకేషన్ మ్యాప్స్, శాటిలైట్ వెదర్ అలర్ట్స్ వంటి సాంకేతిక సాయం కూడా అందనుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే నెల్లూరు జిల్లా అంతర్జాతీయ సముద్ర సాంకేతిక చిత్రపటంలో కీలక స్థానాన్ని ఆక్రమిస్తుంది. అత్యాధునిక సెన్సార్ ఇంటిగ్రేషన్, నావిగేషన్ సిస్టమ్స్ మరియు రిమోట్ కంట్రోల్ టెక్నాలజీలతో రూపొందే ఈ నౌకలు సముద్ర నిఘా, మైన్ డిటెక్షన్ , లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి కీలకమైన కార్యకలాపాల్లో దేశానికి రక్షణ కవచంలా మారనున్నాయి

# వైసీపీకి అలేఖ్య బాణం...

**విజయవాడ, మార్చి 14, పెన్ పవర్:**
నందమూరి తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి పొలిటికల్ ఎంట్రీ పై అప్పుడే అనేక రకాల చర్చలు ప్రారంభం అయ్యాయి. ఏమో రాజకీయాల్లోకి రావచ్చు అన్న మాటలతో నందమూరి అభిమానులతో పాటు టిడిపి మద్దతుదారులలో ఒక ఆసక్తిని రేకెత్తించింది. రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు అలేఖ్య రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. అయితే ఆమె వైసీపీ మాజీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డికి సమీప బంధువు. దీంతో ఆమె పొలిటికల్ ఎంట్రీ పై భిన్న కామెంట్స్ వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అలేఖ్య రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఒకరకమైన గందరగోళానికి దారితీస్తున్నాయి. తారకరత్న మృతి చెంది మూడేళ్లు అవుతోంది. అయితే ఆమెకు అత్తింటి వారి నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లేదని ఆమె మాటల్లోనే అర్థమవుతోంది. అదే సమయంలో చంద్రబాబు, బాలకృష్ణ విషయంలో ఆమె సాఫ్ట్ గానే ఉన్నట్లు కనిపిస్తున్నారు.లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. కానీ ఆయన భార్య అలేఖ్య రెడ్డి మాత్రం ఒంటరిగానే ఉంటున్నారు. ఈ క్రమంలో తాజాగా కొన్ని ఇంటర్వ్యూలో రాజకీయపరమైన ప్రకటనలు చేశారు. ఆమె నందమూరి వారి కోడలు కావడంతో పొలిటికల్ ఎంట్రీ అనగానే టిడిపిలో అడుగుపెడతారని భావిస్తారు. కానీ అలేఖ్య




రెడ్డి మాత్రం తాను రాజకీయాల్లోకి వస్తాను కానీ.. అందుకు ఏ పార్టీ సరైనది అని నిర్ధారించుకోలేదని చెప్పారు.అలేఖ్య రెడ్డిమాటలు చూస్తే మాత్రం ఆమె నందమూరి కుటుంబం పై అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అలేఖ్య రెడ్డిని పెద్దలకు ఇష్టం లేకున్నా ప్రేమ వివాహం చేసుకున్నారు తారకరత్న. కుటుంబ సభ్యుల సంపూర్ణ అంగీకారం లేకుండానే వారి వివాహం జరిగినట్లు ఆమె మాటల్లోనే అర్థమవుతోంది. అయితే ఇటువంటి అసంతృప్తితో ఉన్న క్రమంలో ఆమె పొలిటికల్ ఎంట్రీ ప్రకటన చేయడం మాత్రం ఆసక్తి రేపుతోంది. పైగా విజయసాయిరెడ్డి సమీప బంధువు కావడం.. ఆయన ఆ కుటుంబానికి అండగా నిలుస్తుండడం చూస్తుంటే మాత్రం ఆయనతో కలిసి ఏదైనా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈ అవకాశాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పకుండా తమకు అనుకూలంగా మార్చుకోగలదు. ఎందుకంటే ఇప్పటికే లక్ష్మీపార్వతిని ఇలానే టిడిపి నాయకత్వం పై ప్రయోగిస్తోంది.ఇప్పటికే లక్ష్మీపార్వతి చంద్రబాబు తో పాటు నందమూరి కుటుంబాన్ని టార్గెట్ చేసుకుంటూ వస్తున్నారు. చంద్రబాబుపై ఘాటు వ్యాఖ్యలు చేయాలంటే నందమూరి కుటుంబం పై సాఫ్ట్ కార్నర్ తో మాట్లాడుతుంటారు. అలాగే నందమూరి కుటుంబ సభ్యులకు కూడా విమర్శలు చేస్తుంటారు. జూనియర్ ఎన్టీఆర్ విషయంలో లక్ష్మీపార్వతి కన్నీరు కారుస్తుంటారు. అందుకే ఇప్పుడు అలేఖ్య రెడ్డిని పార్టీలోకి తీసుకొని.. టిడిపి నాయకత్వంతో పాటు నందమూరి కుటుంబాన్ని టార్గెట్ చేయవచ్చు. ఇటువంటి రాజకీయాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది అందివేసిన చేయి. అందుకే అలేఖ్య రెడ్డి పొలిటికల్ ఎంట్రీ ప్రకటన ఏపీలో హాట్ టాపిక్ అవుతోంది. ఆమె ప్రయాణం ఎలా ఉండబోతుంది? ఆమె ఎవరు వదిలిన బాణం అన్నది తెలియాల్సి ఉంది.

# ప్రపంచ్ కప్ అయినా కూడా ఇలా తొండి చేయొద్దు

## రనౌట్ వివాదంపై కైఫ్ సంచలన కామెంట్స్






**హైదరాబాద్ పెన్ పవర్:** పాక్-బంగ్లా మధ్య జరిగిన వండే మ్యాచ్ లో రనౌట్ వివాదం ఇప్పట్లో ముగిసేలా లేదు. పాకిస్తాన్ బ్యాటర్ అలీ ఆఘా ఔటైన విధానంపై క్రికెట్ సర్కిల్ లో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. బంగ్లాదేశ్ కెప్టెన్ మెహ్దీ హాసన్ మిరాజ్ చేసిన పని గల్లీ క్రికెట్ కంటే ఘోరంగా ఉందని ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదంపై ఇండియన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

బంగ్లా కెప్టెన్ మెహ్దీ హాసన్ చేసింది క్రీడాస్పూర్తికే విఘాతం కలిగించేలా ఉందని సీరియస్ కామెంట్స్ చేశారు కైఫ్. ఇది జరగాల్సింది కాదు. వికెట్స్ పడటం లేదనే నిరాశలో ఇంతకు దిగజారటం కరక్టేనా..? వికెట్లు పడటం లేదని ఇలాంటి రనౌట్ సమర్థించాలా..? అది కూడా ఒక కెప్టెన్ చేయడమేంటి..? యంగ్స్ స్టర్స్ నేర్చుకోండి.. ప్రపంచ కప్ ఉన్న కూడా బంగ్లా కెప్టెన్ చేసినపని చేయకండి. నిజాయితీ లేని ఆటలు అవి ఆటలే కావు.. అంటూ మండిపడ్డారు కైఫ్

**వివాదం ఏంటి..?**

పాకిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య శుక్రవారం (మార్చి 13) జరిగిన మ్యాచ్ లో రనౌట్ తీవ్ర వివాదాస్పదం అయ్యింది. ధాకాలోని షేర్-ఇబంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు ఫుల్ ట్రెండింగ్ లో ఉంది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ముందుగా బ్యాటింగ్ చేయగా.. మహమ్మద్ రిజ్వాన్(44)తో కలిసి సల్మాన్ అలీ ఆఘా (64) నాలుగో వికెట్‌కు 109 పరుగుల పాట్నర్ షిప్ నెలకొల్పాడు. వికెట్ పడకుండా ఆడుతూ బంగ్లా బౌలర్లకు చుక్కలు చూపించారు. ఎంతకూ వికెట్ పడటం లేదనో ఏంటో కానీ.. అవకాశం వచ్చింది కదా అని క్రీడాలోకం నవ్వుకునే పని చేశాడు బంగ్లా కెప్టెన్ మెహ్‌దీ హసన్ మిరాజ్. 39వ ఓవర్‌లో మహమ్మద్ రిజ్వాన్ బౌలర్‌వైపు షాట్ ఆడాడు. బంతి కాస్త నాన్‌స్ట్రైకర్‌లో ఉన్న సల్మాన్ అలీ అఘా బ్యాట్‌కు తాకింది. దాంతో ఆ బంతిని సల్మాన్ అలీ అఘా బౌలర్‌కు అందించే ప్రయత్నం చేశాడు.కానీ మెహ్‌దీ హసన్ మిరాజ్ వేగంగా బంతిని అందుకొని నాన్‌స్ట్రైకర్ వికెట్లను కొట్టి రనౌట్ కోసం అప్పీల్ చేశాడు. దాంతో సల్మాన్ అఘా అవాక్కయ్యాడు. బంతిని అందించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలనుకున్న అతనికి ఈ అనూహ్య ఘటన తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఫీల్డ్ అంపైర్.. థర్డ్ అంపైర్ రివ్యూ కోరగా బ్యాటర్ క్రీజు బయటే ఉన్నాడని ఔటిచ్చాడు.దాంతో తీవ్ర అసహనానికి గురైన సల్మాన్ అఘా.. బంగ్లా ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. పెవిలియన్ చేరుతూ బ్యాట్, గ్లౌజులను నేలకు కొట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ముందుంది ముసళ్ల పండుగ: గంభీర్‌కు దాదా వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు ఐసీసీ ట్రోఫీలు సాధించిన తొలి టీమిండియా కోచ్ గా గౌతమ్ గంభీర్ రికార్డు సృష్టించాడు. టీ20 వరల్డ్ కప్-2026 తో పాటు, చాంపియన్స్ ట్రోఫీ-2025 గంభీర్ ఖాతాలో పడ్డాయి. టీమ్ లో మార్పులు చేర్పులతో గందరగోళానికి గురిచేస్తున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ.. టీ20 కప్ వచ్చాక గంభీర్ మీద ఉన్న ఆరోపణలు దాదాపు తగ్గిపోయాయి. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఇచ్చిన వార్నింగ్ చర్చనీయాంశంగా మారింది. ముందుంది ముసళ్ల పండుగ అంటూ హెచ్చరించాడు దాదా. వైట్ బాల్ క్రికెట్ లో భాగంగా 2027 ప్రపంచ కప్ అత్యంత సవాళ్లతో కూడుకున్నదిగా గంగూలీ అభివర్ణించాడు. గంభీర్ కు అసలైన పరీక్ష 2027లో సౌతాఫ్రికాలో మొదలవుతుంది. అక్కడ పరిస్థితులు గంభీర్ ను టెస్ట్ చేస్తాయి. కానీ అతనికి ఉన్న టీమ్ తో దాన్ని సాధిస్తాడనే నమ్మకం ఉంది.. అంటూ మనీ కంట్రోల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బొరియా మజుందార్ తో అన్నాడు దాదా.

ఇండియాకు 2023 వరల్డ్ కప్ ఇప్పటికీ నోటి దాకా వచ్చి చేజారిన ముద్ద లాంటిది. ఎందుకంటే సీజన్ మొత్తం అద్భుతంగా రాణించి.. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి చవిచూసింది. ఆ సిరీస్ లో ఇండియా గేమ్ చూసి కప్ మనకేనని ఫ్యాన్స్ భావించారు.

ఒక ప్లేయర్ గా 2011 వరల్డ్ కప్ గెలిచిన గంభీర్.. కోచ్ గా 2027 లో వరల్డ్ కప్ ఎదుర్కోవడం సవాళ్లతో కూడుకున్న విషయమేనని గంగూలీ అన్నాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి సీనియర్ అనుభవజ్ఞులు ఉండటం కలిసొచ్చే అంశంగా అభిప్రాయపడ్డాడు.

అదే విధంగా గంభీర్, అతని టీమ్ రెడ్ బాల్ క్రికెట్ లో ఇంకా ఇంప్రూవ్ కావాల్సి ఉందన్నాడు. దానికి ఏకైక మార్గం వికెట్ గురించి తక్కువగా ఆలోచించడమేనన్నాడు. గంభీర్ కు కాస్త టైమ్ ఇవ్వాలని బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందే చెప్పినట్లు గుర్తు చేశాడు. వైట్ బాల్ క్రికెట్ లో కోచ్ గా ప్రూవ్ చేసుకున్నాడని.. కానీ రెడ్ బాల్ క్రికెట్ లో.. అంటే టెస్టులలో మెరుగవ్వాల్సి ఉందని సలహా ఇచ్చాడు దాదా.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెవిన్ పీటర్సన్ గుడ్ బై.. కామెంటరీ బాక్స్‌లో కలుసుకుందాం అంటూ కామెంట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఫ్రాంచైజీకి వీడ్కోలు పలుకుతున్నట్టు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ తెలిపాడు. జట్టు మెంటార్ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శనివారం ప్రకటించాడు. అయితే, ఈ లీగ్ లో గతంలో మాదిరే కామెంటేటర్‌గా కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించింది. హెడ్ కోచ్ హేమాంగ్ బదానీ, అసిస్టెంట్ కోచ్ మాథ్యూ మోట్, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ వంటి సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి కేపీ పనిచేశాడు. “ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటార్‌గా కొనసాగలేను. ఈ బాధ్యతలకు అవసరమైన సమయాన్ని కేటాయించలేకపోతున్నాను. ఆటగాళ్లందరికీ శుభాకాంక్షలు. అయితే, కామెంటరీ బాక్స్‌లో మళ్లీ కలుస్తాను” అని ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ చేశాడు.దక్షిణాఫ్రికాలో జన్మించిన పీటర్సన్, ఇంగ్లండ్ తరఫున 104 టెస్టులు, 136 వన్డేలు ఆడాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా నిలిచి ఇంగ్లండ్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణే జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

ఇదిలా ఉండగా,

బీసీసీఐ ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 వరకు 20 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా పూర్తి షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని బీసీసీఐ తెలిపింది.



# సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న శ్రీ లీల.. ఆ ప్రత్యేకత గమనించారా?



ప్రియా ప్రకాష్ సిటీ వీధులను తన స్టైల్ ర్యాంప్‌గా మార్చుకుంది

టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. వెండితెరపై తన డ్యాన్స్‌లతో, నటనతో కుర్రాళ్ల మతులు పోగొట్టే ఈ ‘ధమాకా’ పాప, తాజాగా పోస్ట్ చేసిన ఫోటోల్లో అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా మెరిసిపోతోంది. మోడ్రన్ దుస్తుల్లో ఎంత స్టైలిష్‌గా ఉంటుందో, సంప్రదాయ చీరకట్టులో అంతకంటే రెట్టింపు అందంతో కనిపిస్తూ ఫ్యాన్స్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆమె ధరించిన అవుట్‌ఫిట్ మరియు నగల్లోని ప్రత్యేకత ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.

**పట్టుచీరలో మెరిసిపోతున్న ‘పెళ్లిసందడి’ బ్యూటీ:**

శ్రీలీల ఈ ఫోటోషూట్ కోసం ఎంచుకున్న అవుట్‌ఫిట్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. రిచ్ కలర్ పట్టుచీరలో ఆమె లుక్ చాలా రాయల్‌గా కనిపిస్తోంది. సాధారణంగా నేటి తరం హీరోయిన్లు మోడ్రన్ ఫ్యాషన్‌పై మక్కువ చూపుతుంటారు, కానీ శ్రీలీల మాత్రం మన సంప్రదాయ కట్టుబాట్లకు పెద్దపీట వేసింది. ఆ చీరకు మ్యాచ్ అయ్యేలా డిజైన్ చేసిన బ్లౌజ్ మరియు ఆమె కట్టుకున్న తీరు చాలా హుందాగా ఉంది. ఫొటోల్లో ఆమె చిరునవ్వు, ఆ నిండుదనానికి ఫిదా అవుతున్న నెటిజన్లు “శ్రీలీల అంటే కేవలం ఎనర్జీ మాత్రమే కాదు, అందానికి నిలువుటద్దం” అంటూ కామెంట్లు పెడుతున్నారు.

**నగల్లోనూ ప్రత్యేకతే.. ఆ ట్రెడిషనల్ టచ్ చూశారా:**

ఈ ఫోటోల్లో శ్రీలీల ధరించిన నగలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేవలం నగలు పెట్టుకోవడమే కాకుండా, మన పూర్వీకుల కాలం నాటి సంప్రదాయ డిజైన్లను ఆమె ఎంచుకోవడం విశేషం. షాట్ నెక్లెస్‌తో పాటు, దానికి తగినట్లుగా ఉన్న జుంకీలు ఆమె ముఖ వర్ఛస్సును పెంచేశాయి. ఇక ముఖ్యంగా నుదుట పెట్టుకున్న పెద్ద బొట్టు, తలలో పూలు ఆమెను ఒక దేవతలా మార్చేశాయి. ప్రతి నగలోనూ ఎంతో సున్నితమైన పనితనం కనిపిస్తోంది. సంప్రదాయం ఉట్టిపడేలా ఆమె ఎంచుకున్న ఈ జ్యువెలరీ సెలక్షన్ ఇప్పుడు ఫ్యాషన్ ప్రియులను కూడా విశేషంగా ఆకట్టుకుంటోంది.

**శ్రీలీల గ్రేస్ వేరే లెవల్:**

శ్రీలీల పోస్ట్ చేసిన ఈ ఫోటోలు నిమిషాల్లోనే వైరల్ అయ్యాయి. కేవలం ఫోటోలే కాకుండా, ఆమె ఇచ్చిన పోజులు మరియు కళ్ళతో పలికించిన హావభావాలు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. గ్లామర్ షోకు దూరంగా, ఎంతో పద్ధతిగా ఉంటూనే ఇంత అందంగా కనిపించడం శ్రీలీలకు మాత్రమే సాధ్యమని ఆమె అభిమానులు మురిసిపోతున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, అప్పుడప్పుడు ఇలాంటి ఫోటోషూట్లతో తనలోని క్లాసిక్ యాంగిల్‌ను బయటకు తీస్తూ అందరినీ ఆశ్చర్యపర చడం ఆమె స్టైల్. మొత్తానికి ఈ ట్రెడిషనల్ లుక్ శ్రీలీల కెరీర్‌లో బెస్ట్ ఫోటో షూట్లలో ఒకటిగా నిలిచిపోనుంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com